# పల్నాడు జిల్లా వార్త



## డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నరసరావు పేట, జనవరి 20 ప్రభాతవార్త::ఈ నెల 22న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన నేపథ్యంలో కోటప్పకొండ పరిసర ప్రాంతాలలో ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ కృతికశుక్లా పరిశీలించారు. గురువారం ఉదయం కోటప్పకొండకొత్తపాలెం రోడ్డు మార్గాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. అనంతరం కోటప్పకొండ మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లను సమీక్షించి, స్వామివారిని దర్శించుకుంటారని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ సంజనా సింహ్, డీఆర్వో మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

కారంపూడి, జనవరి 20 ప్రభాతవార్త: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి గణపతి, నవగ్రహ, సుదర్శన, మహాలక్ష్మి, రుద్ర, మహామృత్యుంజయ, శ్రీలలిత సహస్రనామ స్తోత్ర హోమాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు.



కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు మద్దు హనుమంత రావు, కమిటీ సభ్యులు, నగరేశ్వరస్వామి ధర్మకర్త యక్కల శ్రీనివాసరావు, పాలకవర్గం, ఆర్యవైశ్య మహిళా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి: టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, జనవరి 19 ప్రభాతవార్త : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత యరపతినేని నిఖిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా జ్యోతి పథకంలో



భాగంగా మంగళవారం స్థానిక ఎంపీ జడ్పీహైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ను అందించారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అలాగే పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆర్యవైశ్య మహిళలు నిర్వహించిన ప్రత్యేక కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 'కూటమి' ప్రభుత్వం నిధుల కేటాయింపుపై అమీర్ ఆలీ హర్షం



పిడుగురాళ్ల, జనవరి 19 ప్రభాతవార్త : కడపలో ఈనెల 23, 24, 25 తేదల్లో జాతీయ స్థాయిలో తబ్లిక్ జమాయత్ ఇస్తేమా నిర్వహణ కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోనే కూటమి ప్రభుత్వం రూ.1.25 కోట్లు కేటాయించడం పట్ల టీడీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2014-2019 కాలంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇదే విధంగా నిధులు విడుదల చేశారన్నారు. సీఎం చంద్రబాబు ముస్లింల పక్షపాతి అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింమైనార్టీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## దళితులపై జగన్‌రెడ్డిది కపట ప్రేమ

### -నీచ రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ: -టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య

పిడుగురాళ్ల, జనవరి 19 ప్రభాతవార్త : దళితపై జగన్‌రెడ్డి కపట ప్రేమ చూపుతూ ప్రతి చిన్న విషయానికి నీచ రాజకీయం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం 11 సీట్లకే పరిమితం కావడంతో వైసీపీ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పాకులాడుతుందన్నారు. పిడుగురాళ్ల పట్టణానికి వ్యక్తిగత పనిపై వచ్చిన తనకు మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జరిగిన ఘటనపై వైసీపీ నేతలు చేసిన డ్రామాను చూపి నిజనిజాలు మాట్లాడాలనుకున్నానని, ఈ రెండు కుటుంబాల మధ్య ఇంటి దగ్గర జరిగిన గొడవను రాజకీయం చేయాలని డీఎస్పీ దగ్గర ఫిర్యాదు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగినందుకు పిచ్చోడిగా ముద్ర వేసి అతను చనిపోవడానికి కారణమైంది జగన్ కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి దళిత డాక్టర్ కనపడలేదా అని విమర్శించారు. దళితులపై జగన్‌రెడ్డికి ఉన్న అసూయ, ఈర్ష్య, అలసత్వం కారణంగా కొంత మంది దళితుల మరణించారన్నారని, అప్పుడేం చేశావు మహేష్‌రెడ్డి అంటూ



ఆగ్రహం వ్యక్తం చేశారు. శవాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయ రచ్చ చేయడం సమంజసం కాదన్నారు. దళితులకు బేడీలు వేయించి నడిపించినప్పుడు వాళ్ల దళిత రైతులని జగన్‌రెడ్డికి తెలియదా.. గురజాలలో దళిత వ్యక్తి విక్రమ్‌ను దారుణంగా హత్య చేసినప్పుడు ఎక్కడున్నావు మహేష్‌రెడ్డి అని ప్రశ్నించారు. ముసలి కన్నీరు కారుస్తూ దళితులపై ప్రేమను చూపించడం హాస్యాస్పదమన్నారు. కల్తీ లడ్డు, మద్యం కుంభకోణంలో విజయసాయిరెడ్డి సాక్ష్యం చెప్పేందుకు తయారవడంతో జగన్‌రెడ్డి వణుకుతున్నారని, మిథున్‌రెడ్డి కూడా బయటకు వచ్చి జగన్ చేసిన పాపాలను బయటపెట్టాలని రామయ్య కోరారు. జగన్ లాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరారని అన్నారు. హుందాగా రాజకీయాలు చేయాలి గానీ వక్రీకరించి రాజకీయ ఆరోపణలు చేయడం తగదన్నారు.

## ఆర్యవైశ్య మహిళల ప్రత్యేక పూజలు

గురజాల, జనవరి 19 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ దినంను ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్యవైశ్య అమరజీవుల గీతాలాపన జరిపారు. అమ్మవారికి కుంకుమార్చన,



నగరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అగ్నిగుండ పూజా కార్యక్రమాలు జరిపారు. మహిళా భక్తులు లలితా పారాయణ పఠనం చేశారు. పూర్ణాహుతి నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు మూర్తి శ్రీనివాసరావు, కోశాధికారి పుల్లారావు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

## పశుపోషకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త: : పశుపోషకులకు అండగా నిలుస్తూ, పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు.పట్టణంలోమంగళవారం ఏర్పాటు చేసిన పశు సంచార వైద్య సేవ కేంద్రం వాహనాన్ని



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పశువుకు ఆరోగ్యం బాగాలేని సమయంలో 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే వాహనం వచ్చి చికిత్స అందించి వెళ్లేదని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మరింతమెరుగైన సేవలందిం చాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరంగా సేవలందించే విధంగా 104 సంచార పశు వైద్య సేవలను అందుబాటులోకితీసుకువచ్చిందన్నారు. మంగళవారం నుంచి పశు సంచార వైద్య సేవ వాహనం మండలంలో ప్రతిరోజు రెండు గ్రామాల్లో ప్రశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంజరుగుతుందని నియోజకవర్గంలోని రెండు మండలాలకు రెండు వాహనాలు కేటాయించడం జరిగిందన్నారు. గ్రామీణప్రాంతాల్లోనిపశుపోషకులకు పశువుల ఆరోగ్య సంరక్షణ ఎంతో కీలకమని, పాడి పశువులే రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో ఈ సంచార వైద్య సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక రంగానికీ సమాన ప్రాధాన్యతఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడి రామచంద్రరావు, పశు వైద్యులు శ్రీరామ్ పాల్గొన్నారు.

## శ్రీ వాసవీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే అరవింద్‌బాబు

నరసరావుపేట, జనవరి 20 ప్రభాతవార్త : : పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారి ఆర్భణం (గుండ ప్రవేశం)సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని వాసవి అమ్మవారికి పట్టు సమర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ పర్వదినాన్ని అధికారిక కార్యక్రమంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ తరఫున అమ్మవారికి పట్టు సమర్పించడం విశేషంగా నిలిచింది. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు, మంగళ



హారతులలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణం త్యాగానికి, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని,ఇటువంటిఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో మంచి విలువలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. తెల్లవారి నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమాసు మెహర్ బాబు, ఆలయ సెక్రటరీ కొత్త మాసు వెంకటప్పయ్య, ఆలయ ట్రెజరర్ పొత్తూరు వెంకటలక్ష్మి      ్మ వరప్రసాదరావు, గట్టుపల్లి సత్యనారాయణ, పురా భాస్కరరావు, ఛాంబర్ అఫ్ కామర్స్అధ్యక్షులుసాంబశివరావు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు వైకాపా అండగా ఉంటుంది : మాజీ మంత్రి రజనీ

యడ్లపాడు, జనవరి 20, ప్రభాతవార్త : వైయస్ఆర్ సీపీ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలకు పార్టీ ఎంప్పుడూ అండగా ఉంటుందని వైయస్ఆర్ సీపీ నాయకురాలు మాజీ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. మండల పరిధిలోని కారుచోల గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాజీ మంత్రి విడదల రజినికి ఘనస్వాగతం



పలికారు. కారుచోల గ్రామంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా నూతన కమిటీ ల ఏర్పాటు కోసం గ్రామంలో మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని పర్యటించారు. వీధి వీధి తిరుగుతూ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కారుచోల గ్రామం మొదట నుండి వైసీపీకి కంచుకోటగా నిలుస్తోందని తెలిపారు. ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలను అభినందించారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భం గా నూతన గ్రామ కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ జగదీష్

గురజాల, జనవరి 19 ప్రభాతవార్త : ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ జగదీష్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వెంకట్రావు కాలనీలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణంకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఘర్షణల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు చెప్పారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని బైకులు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆవుల భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



**పిజిఆర్ఎస్ పిటిషన్‌పై విచారణ:** మండలంలోని చర్లగుడిపాడు చెందిన నాగేండ్ల మంగయ్య అనే వృద్ధుడు వేసిన పిటిఆర్ఎస్ పిటిషన్‌ను మంగళవారం డీఎస్పీ జగదీష్ విచారించారు. గ్రామానికి చేరుకొని మంగయ్యను విచారించారు. తన కుమారులు తన పొలం, ఇల్లు, డబ్బులు తీసుకొని తనను పట్టించుకోవడం లేదని డీఎస్పీ జగదీష్ ఎదుట మంగయ్య వాపోయారు. కనీసం తనకు తిండి కూడా పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్పీ వెంట సీఐ భాస్కర్ ఉన్నారు.

## జేసీగా బాధ్యతలు స్వీకరించిన సంజన సింహ



రొంపిచర్ల,జనవరి 20 ప్రభాతవార్త : :పల్నాడు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా సంజన సింహ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను మర్యాదాపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సంజన సింహను శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

రొంపిచర్ల, జనవరి 20 ప్రభాతవార్త : మండలంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పేటేటి



వేమలబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత, అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్ది రామబ్రహ్మానందరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య, ఆర్యవైశ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితో కోటప్పకొండ తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

### సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

నరసరావుపేట,జనవరి 20 ప్రభాతవార్త ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వార్షిక తిరుణాళ్ళ ఉత్సవాలు ఫిబ్రవరి 15వ తేదీన ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో, కోటప్పకొండపై శాఖల వారీగా చేపట్టనున్న ముందస్తు ఏర్పాట్లు, అభివృద్ధి కార్యక్రమాలపై నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుణాళ్ళ సమయంలో లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు,అగ్నిమాపక శాఖ సిద్ధత తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు.పటిష్ట పోలీస్ బందోబస్తు - ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికభక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అరవింద బాబు అధికారులను ఆదేశించారు. కోటప్పకొండకు వచ్చే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్‌కు



ప్రత్యేక స్థలాలు కేటాయించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ వ్యవస్థనుమరింతసమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.అత్యవసర వైద్య సేవలు - అంబులెన్సులు సిద్ధంగా ఉండాలితిరుణాళ్ళ సందర్భంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృత్తికా శుక్ల ఆదేశించారు. ముఖ్యంగా




వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.పారిశుద్ధం, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టిపారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, చెత్త తొలగింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.తాగునీటిసరఫరాలో అంతరాయం లేకుండా ట్యాంకర్లు, వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అదనపుట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్ల పరిశీల ఈనెల 22వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కోటప్పకొండకు రానున్న నేపథ్యంలో చేపట్టిన వెలిపాడ్, భద్రతా ఏర్పాట్లను ఎమ్మెల్యే అరవింద్ బాబు, కలెక్టర్ కృత్తికా శుక్ల కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్, వీఐపీ రూట్, భద్రతా చర్యలపై పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి తగిన సూచనలు చేశారు.సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం లక్ష      ్యంఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ, కోటప్పకొండ తిరుణాళ్ళ రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన ఉత్సవమని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత సంవత్సరం 25 లక్షల మంది భక్తులు కోటప్పకొండ తిరుణాళ్ళకి వచ్చారని ఈ సంవత్సరం భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుణాలను విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు.ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కొత్తపాలెం నుండి కోటప్పకొండ వరకు నిర్మించిన నూతన రహదారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు డిప్యూటీ సీఎం రోడ్డును ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, ఆర్డీవో మధులత, పోలీస్, రెవెన్యూ, వైద్య, విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖలఅధికారులు,ఆలయ ఈవో,స్థానికప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డిఏ బకాయిలు సక్రమంగా చెల్లించాలని యుటిఎఫ్ వినతి

నకరికల్లు జనవరి 20 ప్రభాతవార్త ::డిఏ బకాయిల చెల్లింపులలో అసమానతలు, సాంకేతిక ఇబ్బందులను సరిచేసి ప్రతి ఒక్కరికి సక్రమంగా బకాయిలు జమ చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి మోహనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిటీఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా రాష్ట్రం లోని 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల డిఏ బకాయిల చెల్లింపునకు రూ 1100 కోట్లు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే చెల్లింపులు ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా చెల్లించారని 3 ఇన్స్ స్టాల్మెంట్ లకు గాను కొందరికి 1, మరికొందరికి 2, ఇంకొందరికి అసలు జమ కాలేదని అన్నారు. ఇటువంటి అసమానతలు తొలగించి అందరికి సమానంగా బకాయిలు చెల్లించాలన్నారు. ఎయిడెడ్,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఒక్క డిఏ కూడా జమ కాలేదన్నారు. రాష్ట్ర ఖజానా శాఖ దృష్టికి విషయాన్ని తీసుకుని వెళ్లిఎయిడెడ్,మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా డిఏ బకాయిలు చెల్లించాలని కోరారు.యుటిఎఫ్ వినతిపై సానుకూలంగాస్పందించిన డిటీఓ విషయాన్ని రాష్ట్ర ఖజనా శాఖ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, నాయకులు టి.వెంకటేశ్వర్లు, డి.కోటేశ్వరరావు,ఎల్.పూర్ణచంద్రరావు, నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిరోధంపై అవగాహన

పెదకూరపాడు, జనవరి 20, ప్రభాతవార్త: పాటిబండ్ల గ్రామంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమాంబి పాల్గొని మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేయాలన్నారు. మగ పిల్లలకు 21 సంవత్సరం నిండిన తర్వాత వివాహ వయస్సు అని వివరించారు. ఆడపిల్లలకు చిన్న వయసులో వివాహం చేయడం ద్వారా గర్భసంచి ఎదుగుదల లేక తల్లి బిడ్డకు ప్రమాదం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## చిలకలూరిపేట డాక్టర్‌కు టైమ్స్ ఆఫ్ ఇండియా గౌరవ పురస్కారం - పల్నాడు ప్రజలకు గర్వకారణం ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు

చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ కొమ్మినేని వీరశంకర రావుకు ప్రతిష్టాత్మక టైమ్స్ ఆఫ్ ఇండియా గౌరవ



పురస్కారం లభించడం పల్నాడు జిల్లా ప్రజలకే గర్వకారణమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డాక్టర్ కొమ్మినేని వీరశంకర రావును ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కొమ్మినేని వైద్యశాల సేవలందించడం అభినందనీయమని తెలిపారు. నాణ్యమైన వైద్యం, సేవాభావంతో చేసిన కృషికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం యువ వైద్యులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. డాక్టర్ వీరశంకర్ రావు మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదం, సిబ్బంది సహకారంతోనే ఈ గౌరవం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, మన్నాన్ షరీఫ్, కూరపాటి శ్రీనివాసరావు, అట్లూరి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో ఎడ్ల బలప్రదర్శన: రైతులకు జ్ఞాపికలు



చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త: చిలకలూరిపేట:పట్టణంలోని గోల్కొండ గార్డెన్ లో నిర్వహిస్తున్న ఎద్దుల పందాలు మూడవ రోజు అత్యంత ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలలో పాల్గొని గెలిచిన రైతులకు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగు వారి సంప్రదాయక్రీడలనుప్రోత్సహించడంలో రైతులు చూపుతున్న ఉత్సాహం అభినందనీయమని కొనియాడారు. వీరితో పాటు పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బత్తినేని శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ పట్టణ సెక్రెటరీ ఎం. రవి పాల్గొని రైతులకుశుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయరంగంలో రైతులు పడుతున్న కష్టాన్ని గుర్తించి, వారిని ఇలాంటి క్రీడల ద్వారా ప్రోత్సహించడం సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడా అభిమానులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండవీడుకోట పై శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రత్తిపాటి పుల్లారావుకు వినతి



చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త: కొండవీడు కోట పైన జనప్రియ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు చేయాలని చిలకలూరిపేట శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం చిలకలూరిపేట శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును కలసి వినతి పత్రం సమర్పించారు. కొండవీడు ఉత్సవాలు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు కొండవీడు పరిపాలనలో ఎలా అభివృద్ధి చెందిందో తెలిసేలా చరిత్ర గురించి ఏర్పాట్లు చేయాలని ప్రత్తిపాటి పుల్లారావు ని కమిటీ సభ్యులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్తిపాటి పుల్లారావుని కలసిన వారిలో తోట బ్రహ్మస్వాములు, రావు సుబ్రహ్మణ్యం, పోతురాజు హరీష్, మిరియాల లక్ష్మీనారాయణ, మారెళ్ల వెంకట శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## రోడ్డుప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త:చిలకలూరిపేట (మం)తాతపూడి హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొనడంతో పల్టీలు కొట్టిన ఆటో ఈ ఘటనలో నలుగురు కి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్తెనపల్లి నుంచి ముప్పవరం వెళుతున్న ఆటో ..108 సిబ్బంది సంఘట స్థలానికి వెళ్లి ప్రాథమిక అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించారు

## 'కల్లూరి' మృతికి సంతాపం

నాదెండ్ల, జనవరి 20, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన కల్లూరి సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. వారి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి వర్యులు



శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించటం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు గారు, బండారుపల్లి సత్యనారాయణ , జవ్వాజి మదన్ మోహన్ , గట్టినేని రమేష్ , నెల్లూరి రామారావు తదితరులు పాల్గొనడం జరిగింది.

## 22న ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 19వ వార్షికోత్సవం

చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త:ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 19వ వార్షికోత్సవం ఈనెల 22వ తేదీ గురువారం పట్టణములోని నన్నపనేని కన్వెన్షన్ హాల్ నందు నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా





జయమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , ధనలక్ష్మి సంస్థల డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, జనసేనపార్టీ చిలకలూరిపేట సమన్వయకర్త తోట రాజావెంకటేష్ తదితరులు విచ్చేయనున్నారు. సుమారు రెండు లక్షల రూపాయల సేవా కార్యక్రమాలలో భాగంగా 8 మందికి కుట్టు మిషన్ లు, ట్రై సైకిల్స్ 5 మందికి, ముగ్గురు విద్యార్థులకు స్కాలర్ షిప్, 50 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేయనున్నారు.

## వెంకటేశ్వర్లు మృతిపట్ల ప్రత్తిపాటి సంతాపం



చిలకలూరిపేట, జనవరి 20, ప్రభాతవార్త: గోవిందాపురం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు మరణం పట్ల మాజీ మంత్రి వర్యులు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుత్తా వెంకటేశ్వర్లు గారి మరణవార్త తెలుసుకున్న ప్రత్తిపాటి పుల్లారావు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మాజీ డిసిసి బ్యాంక్ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు , మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా , నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు , చిలకలూరిపేట మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ , నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు అంబటి సోంబాబు , దగ్గుపల్లి సాంబశివరావు , ముద్దన నాగేశ్వరరావు ముఖ్య నాయకులు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కడప స్టీల్ ప్లాంట్ పనులను త్వరగా ప్రారంభించండి

### జెఎస్ డబ్ల్యు ఎండి పార్థ్ జిందాల్‌తో మంత్రి లోకేష్ భేటీ

గుంటూరు, జనవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి: జెఎస్ డబ్ల్యు సిమెంట్స్ పెయింట్స్ విభాగం మేనేజింగ్ డైరక్టర్ పార్థ్ జిందాల్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కడపలో జెఎస్ డబ్ల్యు స్టీల్ ప్లాంట్ కు భూమిపూజ షెడ్యూలుపై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు




ప్రారంభించాలని మంత్రి లోకేష్ కోరారు. పెయింట్స్ తయారీ రంగంలో మేజర్ ప్లేయర్లు అయిన బర్జర్ పెయింట్స్, ఆసియన్ పెయింట్స్ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో డెకరేటివ్, ఇండస్ట్రియల్ పెయింట్స్ తయారీ సౌకర్యాన్ని ఏర్పాటు చేయండి. భారత్ లో జెఎస్ డబ్ల్యు - ఎల్ జి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని భావిస్తున్న బ్యాటరీ తయారీ యూనిట్ కు అంతర్జాతీయస్థాయి ఎకోసిస్టమ్ కలిగి ఉన్న శ్రీసిటీ లేదా విశాఖను పరిశీలించండి. ఎపిలో ఎంజి మోటార్ బ్రాండ్ ద్వారా కొత్త ఈవి, ।దిని మ్యానుఫ్యాక్చరింగ్ లైన్‌ను ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను అన్వేషించండి. జెఎస్ డబ్ల్యు గ్రూప్ చేపట్టిన హెరిటేజ్ ఎడాప్షన్ ఇనిషియేటివ్స్ లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట కోట, ఉండవల్లి గుహలు వంటి వారసత్వ ప్రదేశాలను స్వీకరించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. పార్థ్ జిందాల్ స్పందిస్తూ... ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# పల్నాడు జిల్లా వార్త



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

సత్తెనపల్లి, జనవరి 20, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో అమ్మవారి అగ్నిగుండం ప్రవేశించిన దినోత్సవం సందర్భంగా ముందుగా ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో పూర్వం నుంచి వస్తున్న



ఆచారంలో భాగంగా ఉదయాన్నే 8 గంటలకు వందల సంఖ్యలో కన్నెలతో (బాలికలు ) అమ్మవారి దేవాలయం వద్ద నుంచి ఊరేగింపు తో నినాదాలు చేసుకుంటూ (జై వాసవి, జై, జై వాసవి ) అని పట్టణ వీధులు గుండా సంఘం బజార్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం లో నుంచి మంచి నీరు కళాశాల్లో నింపుకొని( ఆవుపాలు కలిపి) మరలా అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకుని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేసిన అనంతరం అనేక మంది మహిళా మూర్తులు తో విశిష్ట కుంకుమార్చాన జరిగింది. తెల్లవారిజామునే అమ్మవారి మూల విరాట్ కు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం దాదాపు 2,000 మందికి అన్నప్రసాధ వితరణ జరిగింది. ఉదయాన్నే నారాయణ సేన నగర సంకీర్తణ బృందం చే తోరణపాకు కట్టడం జరిగింది. ఉదయాన్నే నుంచే వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షులు బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు ), గోశాల అధ్యక్షులు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు మరియు కార్యవర్గం పాల్గొన్నారు.

## నేడు చీఫ్‌విప్ జీ.వీ ఆధ్వర్యంలో 'ప్రజాదర్బార్'



వినుకొండ, జనవరి20, ప్రభాతవార్త: వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై బుధవారం ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని 5మండలాలకు చెందిన ప్రజలు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై చీఫ్‌విప్ జీ.వీ తీవ్ర ఆగ్రహం

వినుకొండ, జనవరి20, ప్రభాతవార్త: వినుకొండ ఆర్టిసి డిపోలో సోమవారం ఉదయం జరిగిన తొక్కిసులాట ఘటనపై ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు స్పందించారు. ఆర్టీసీ డిఎం జవ్వాజి నాగేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి



తెలుసుకున్నారు. ప్రయాణికుల రక్షణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తొక్కిసలాటలో గాయపడిన బెల్లంకొండ చిన్న వెంకయ్య, ఎస్తేరు రాణి, తమిరి కోటేశ్వరమ్మ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని చెప్పారు.

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్ పై చర్యలు....**

వినుకొండ ఆర్టిసి డిపోలో తొక్కిసలాట జరిగి ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలవడానికి కారణమైన డ్రైవర్ బాలనాగేశ్వరరావును విధుల నుండి తొలగించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం కూడా ప్రయాణికుల రద్దీ ఉన్నప్పటికీ సరిపడ బస్ సర్వీసులను పెంచడంతో ఎలాంటి ఇబ్బందులు జరగలేదని చెప్పారు.

## వినుకొండ పట్టణాభివృద్ధే ధ్యేయం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ, జనవరి20, ప్రభాతవార్త: సంక్షేమం, అభివృద్ధి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణంలోని 27వ వార్డు క్రిష్టియన్ పాలెం నందు రూ. 7లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి



పనులను ఆయన ప్రారంభించారు. రూ.2 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. రూ.5 లక్షలు వ్యయంతో 10 నూతన విద్యుత్ స్తంభాలతో ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వార్డులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం: జీవి

వినుకొండ, జనవరి20, ప్రభాత వార్త: సీఎం సహాయనిధి పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 113 మంది లబ్ధిదారులకు రూ. 59.86లక్షల చెక్కులను తన కార్యాలయంలో చీఫ్‌విప్ జీవీ



మంగళవారం పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, జనసేన నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ చికిత్స లక్ష్యం

### ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మేడిగం శ్రీనివాసరెడ్డి





వినుకొండ, జనవరి20, ప్రభాతవార్త: పేదలకు తక్కువ ఖర్చుతోనే కార్పొరేట్ స్థాయి చికిత్స అందించడమే లక్ష్యమని హైదరాబాద్ సోమాజిగూడ ప్రముఖ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మేడిగం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వినుకొండ పట్టణంలోని తిరుమల హాస్పిటల్ నందు ఇకపై ప్రతి నెల మూడవ మంగళవారం రోగులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ మేరకు మంగళవారం తిరుమల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను ఈ ప్రాంతానికి చెందిన నూజెండ్ల మండలం, గాంధీనగర్ గ్రామానికి చెందిన వ్యక్తని గుర్తు చేసుకున్నారు. తన సొంత ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రతి నెల మూడవ మంగళవారం ఇక్కడకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధానంగా కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలతో బాధపడే వారికి ఆయన చికిత్స అందించనున్నారు. మోకాళ్ల సమస్యలు, భుజం నొప్పులు, నడుమునొప్పి, వెన్నెముక సమస్యలు ఉన్నవారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. వినుకొండ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వీరంకి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి, తిరుమల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23న 'టిడ్కో' గృహలబ్ధిదారుల పరిశీలన



మాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త: ఏపీటిడ్కో గృహాలు మంజూరైన లబ్ధిదారుల పరిశీలన కార్యక్రమం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు అన్నారు. ఏపీటిడ్కో ద్వారా మంజూరైన 430 చ.అడుగుల విస్తీర్ణం గల డబల్ బెడ్‌రూమ్ గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయంలో తప్పనిసరిగా ఆధార్‌కార్డు నకలు, బ్యాంకు ద్వారా చెల్లించిన నగదుకు సంబంధించిన డీడీల నకలుతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

## ఓటర్ల జాబితాపై రాజకీయ ప్రతినిధులతో సమావేశం

మాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని తహశీల్దారు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి అవగాహన



కల్పించారు. ఓటర్ల జాబితాలో డబల్ ఎంట్రీ, ఫొటోలు సరిగా లేనివాటిని గుర్తించి సమగ్ర విచారణ జరపాలన్నారు. నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి జాబితా అందుబాటులో ఉంచాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండలస్థాయి, బూత్‌స్థాయిల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దుర్గి, వెల్దుర్తి మండలాల తహశీల్దార్లు, పలు పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు కస్టడీకి 'పిన్నెల్లి' సోదరులు

మాచర్ల, జనవరి 20 ప్రభాతవార్త: టీడీఈ నేతల జంట హత్యల కేసులో నెల్లూరు జైల్లో ఉన్న పిన్నెల్లి సోదరులను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ మాచర్ల కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో పిన్నెల్లి సోదరులను పోలీసులు విచారించనున్నారు. జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులతోపాటు ఎ-8 నిందితుడు వెంకటరెడ్డిని కూడా పోలీసులు విచారించనున్నారు. వెంకటరెడ్డి గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నారు.

## మిరప సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించండి



సత్తెనపల్లి, జనవరి 20, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో మిరప సాగు చేయుచున్న రైతుల పొలాలను జిల్లా ఉద్యాన అధికారి ఐ. వెంకట్రావు గారు ఉద్యాన పరిశోధన స్థానం లాంఫామ్ నుండి వచ్చిన కీటక శాస్త్రవేత్త బి. నాగేంద్ర రెడ్డి గారు, సత్తెనపల్లి ఉద్యాన అధికారి యన్.సురేష్ గారు సందర్శించి మిరపలో పాటించవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానధికారి వెంకట్రావు గారు మాట్లాడుతూ నల్ల తామర పురుగు నివారణ కొరకు రైతు సోదరులు ఈ కింద తెలిపిన నివారణ చర్యలను పాటించాలని తెలియజేశారు.

## వైద్యానికి 'కూటమి' ప్రభుత్వం పెద్దపీట



సత్తెనపల్లి, జనవరి 20, ప్రభాతవార్త: వైద్యానికి 'కూటమి' ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయి ప్రభుత్వంలో జరిగే జీవోల అమలు. పని తీరు ఎలా ఉందో తెలుసుకునేందుకు సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సభ్యులు సత్తెనపల్లి ఎమ్మెలేయ కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం తిరుపతి లో పర్యటించారు. తిరుపతి సంబంధించి జిల్లా కలెక్టర్ , మరియు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వారికి సూచించారు.

## భట్లూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

సత్తెనపల్లి, జనవరి 20, ప్రభాతవార్త: భట్లూరు గ్రామం లో వ్యవసాయ శాఖ ద్వారా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి గారు ప్రస్తుత రబీ సీజన్లో వేసినటువంటి పంటలలో సాగు మెలకువలు మరియు




మొక్కజొన్న సెనగ వరిగ పంటలలో ఆశించిన చీడ పీడగురించి తీసుకోవాల్సి నటువంటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అదేవిధంగా ప్రస్తుత రబీ సిజన్లో వేసినటువంటి పంటలను ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇక బుకింగ్ యొక్క ఉపయోగాలు తెలియజేసినారు అలాగే, తిశితిlలీలీ త్పి వ్యవసాయ శాఖ ద్వారా అందించే సాంకేతిక సమాచారాన్ని పంటల సాగు మెలకువలను అందించి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. వరి పంట కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని రైతులు మద్దతు ధరను పొందాలని కోరినారు. మొక్కజొన్న మరియు వరిగ పంటలను పరిశీలించి మొక్కజొన్నలో ఆశించినటువంటి కత్తెర పురుగు నివారణ చర్యలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి రైతు సేవ కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులు సి హెచ్. సురేష్ గారు మరియు రైతులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో 'ప్రజావేదిక'

సత్తెనపల్లి, జనవరి 20, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశానుసారం కార్యాలయం వద్ద గల ప్రజా వేదిక కార్యక్రమం..లో అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ లో రాష్ట్ర లో హత్యాకాండలతో రప్పా రప్పా అంటూ విధ్వంసం సృష్టిస్తున్న వైసీపీ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బిసి సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లింపు లక్షల కోట్ల రూపాయలు బిసి సోదరులకు




అందకుండా చేసి ఆదరణ రద్దు చేశారు వైసీపీ పార్టీ జగన్ రెడ్డి బిసి లకు చేసిన అన్యాయం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కోత పెట్టడం వల్ల రాష్ట్రంలో 16000 పైగా బిసి లకు రాజ్యాంగ బద్ధమైన పదవులకు అన్యాయం జరిగిందిబిసి లతో పెట్టుకుంటే జగన్ రెడ్డి జీవితం లో అధికారం లోకి రాలేవు ప్రజా తీర్పుని గౌరవించి ఇప్పటికైనా నీ హత్య రాజకీయాలు మానుకోవాలి జగన్ రెడ్డి బీసీనేతలను హత్య చేసి బీసీలను భయభ్రాంతులకు గురి చేసినంత మాత్రాన బీసీ లు ఎవరు భయపడరని అదేవిధంగా 2029 జరిగేటటువంటి ఎలక్షన్లలో కూడా జగన్ రెడ్డి పార్టీని కనుమరుగు అయ్యేవిధంగా చేస్తారని రప్పా రప్పా అంటూ భయపెట్టిన అంతమాత్రాన భయపడరని స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసి బీసీల సత్తా ఏంటో చూపిస్తామని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులందరూ ఘంటాపథంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో బట్రాజు కార్పొరేషన్ చైర్మన్ మార్కెట్ రాజు, సత్తెనపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి , పట్టణ ప్రధాన కార్యదర్శి నూర్ భాషా జానీ బాబు , పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య , సర్వేపల్లి సీతయ్య , పట్టణం బీసీ విభాగం అధ్యక్షులు పీలా సాంబశివరావు , మారెళ్ళ స్వామి , జొరిగె శ్రీనివాస్ , ఆరేపల్లి కొండలు , జింకా లోకేశ్వరావు , మారెళ్ళ మల్లేశ్వరావు, సత్తెనపల్లి కృష్ణ , మద్దిగుంట జగదీష్ , సర్వేపల్లి వెంకట్రావు , ఉల్లం శ్రీనివాసరావు మరియు తెలుగుదేశం పార్టీ బీసీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# బాపట్ల జిల్లా వార్త



## నిర్ణీత సమయానికి సిబ్బంది విధులకు హాజరుకావాలి

**నిజాంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** మండలంలో పనిచేస్తున్న పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి తమ విధులకు హాజరవ్వాలని ఎంపిడిఓ నాగలక్ష్మీ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి హాజరుకాని సిబ్బందికి ఆ రోజు సెలవుగా ప్రకటించి జీతంలో కోత విధిస్తారన్నారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరు తప్పనిసరి అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చట్ట ప్రకారం వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యుఎస్, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**నిజాంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** పశువుల సంరక్షణకు పెంపకందార్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిజాంపట్నం పశువైద్యాధికారి డాక్టర్ షేక్ కరీముల్లా అన్నారు. మంగళవారం మండలంలోని ఆముదాలపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిభిరంలో ఆయన పశువులకు వైద్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా కృష్ణ, గోపాలమిత్ర శంకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శవేదిక సేవలు ఆదర్శనీయం : మునిసిపల్ కమిషనర్ సాంబశివరావు

**రేపల్లె, జనవరి 20, ప్రభాతవార్త:** పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న రేపల్లె పట్టణ ఆదర్శవేదిక సేవలు ఆదర్శనీయమని రేపల్లె పురపాలక సంఘం కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు.మంగళవారం



చంద్రమౌళి ఉద్యానవనం పక్కనే ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ చలి నుంచి రక్షణ కల్పించే విధంగా దుప్పట్లు పంపిణీ ప్రశంసనీయమన్నారు.పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో కూడా రేపల్లె పట్టణ వేదిక నిర్వాహకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటున్నాయని కమిషనర్ సాంబశివరావు సంతృప్తి వ్యక్తం చేశారు.రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు.మహిళలు,విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులను అందించే కార్యక్రమం 16 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.వేసవిలో కనీస బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీరుస్తున్నామని దాతల సహాయ సహకారాలులభిస్తున్నాయని చెప్పారు.పేదలందరికీ సేవా కార్యక్రమాలు అందేలా చూస్తున్నామని కిషోర్‌బాబు తెలిపారు.రేపల్లె ప్రాంత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళడంలో రేపల్లె పట్టణ ఆదర్శ వేదిక శక్తివంచన లేకుండా పనిచేస్తున్నదని ఆయన వివరించారు.బాపట్ల జిల్లాలోని రేపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పడినందున పూర్తిస్థాయిలో డివిజనల్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని,బిటెక్, ట్రిపుల్‌ఐటి,కేంద్రీయ విద్యాలయం తదితర ఉన్నత విద్యను రేపల్లె పట్టణంలో అందుబాటులోకి తేవాలని ఏనాటి నుంచో అధికారులు,ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నామని కిషోర్‌బాబు వెల్లడించారు.ప్రజల సంక్షేమం నెరవేరితేనే ఆర్థికాభివృద్ధి నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రేపల్లె పట్టణ ఆదర్శవేదిక అధ్యక్షుడు బి.వి.మోహనరావు, ఓల్డుటౌన్ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం అర్చక స్వామి నల్లూరి సాయికృష్ణమాచార్యులు,కె.నటరాజ్,కె.ఆనందరావు, జి.సాంబశివరావు ,కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది

### జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,జనవరి20,ప్రభాతవార్త:** సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. నీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాల జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే ప్రక్రియ సమర్థంగా చేపట్టాలని అదేశించారు. ఐదు మండలాలు విడిపోయిన తర్వాత జిల్లాలో 351 గ్రామపంచాయతీలు ఉండగా 11.25 లక్షల జనాభా ఉన్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,95,495 గృహాలు ఉన్నాయని, ఒక లక్ష 26 వేల 122 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. మరో ఒక లక్ష 28,873 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అమృతధారా పథకం కింద నీటి సరఫరా కొరకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి 55 లీటర్ల పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం జల జీవన్ మిషన్ కింద రూ.159.88 కోట్లతో 619 పనులు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ప్రస్తుతం రూ.93.83 కోట్లతో 248 పనులు మాత్రమే చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా బ్యాంకులకు జిల్లా పరిషత్ నుంచి రూ.4.39 కోట్లు నిధులు రావాల్సి ఉందని, తక్షణమే విడుదల చేయాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు, చెరువులు, నీటిని శుద్ధి చేసే ట్రీట్మెంట్ ప్లాంట్ల వద్ద తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు.స్వచ్ఛభారత్ మిషన్ కింద సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. 320 సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యం కాగా ప్రస్తుతం 186 మాత్రమే పూర్తి చేయడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. 2.63 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంకాగా, నేటికీ 10,039 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ప్రతి గ్రామంలో మరుగుదొడ్లు ఉండాలన్నారు,పారిశుద్ధ్య గ్రామాలుగా బాపట్ల జిల్లాను తీర్చిదిద్దాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో ఉన్న కమిటీలు సమర్థంగా పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లా పరిషత్ నుంచి బాపట్ల జిల్లాకు ఎంత నిధులు కేటాయిస్తున్నారు. ఏ పనులకు వాటిని



వినియోగిస్తున్నారో సమగ్రమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీల అభివృద్ధికి నిధుల కేటాయించాలని పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డిపిఓ ప్రభాకర్ రావు, డిఆర్‌డిఏపిడిబి సింగయ్య, గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కృష్ణ, డ్వామా ఏపిడి శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం

**రేపల్లె, జనవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం శ్రీ వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం వైభవంగా జరిగింది.శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు రేపల్లె



నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించారు.పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఆర్యవైశ్య మహిళా సంఘం



సభ్యులు కలశాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పి.గౌరీరామకుమారి,సత్యవతి,కాళేపల్లి హారిక,ఆలపాటి వేణుగోపాలరావు, వేమూరి వెంకటేశ్వరరావు,పాండురంగారావు,నంబూరు సత్యప్రసాద్,ఆకుల సాయి,గుర్రం మురహరిరావు,డొక్కు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక కుంకుమార్చన

**భట్టి ప్రోలు(రేపల్లె), జనవరి 20, ప్రభాతవార్త:** శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్,వాసవి కుబేర వనిత ఆధ్వర్యంలో 102 మంది మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.భక్తి శ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ కార్యక్రమాలు జరిగాయి.వాసవి క్లబ్, వాసవి కుబేర వనిత క్లబ్ నిర్వాహకులు పూజలకు అవసరమైన



సామాగ్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు వాసవి క్లబ్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగభూషణం,కార్యదర్శి వెంకటేశ్వరరావు,కోశాధికారి జగదీష్, వాసవి క్లబ్ కుబేర వనిత అధ్యక్షురాలు పెనుగొండ నాగరాజకుమారి, కార్యదర్శి శిరం పద్మావతి,కోశాధికారి ఎస్.మాధురి దేవి,దేవాలయం కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా,అద్దేపల్లి,భట్టిప్రోలు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### అత్యంత వైభవంగా శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

**అమరావతి,జనవరి20,ప్రభాతవార్త :** పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ఉదయం గణపతి పూజ అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపిన అనంతరం అత్యంత వైభవంగా అమ్మవారిని అలంకరించి ఆలయ అర్చకులు ఈచర్ల బాలాజీ భక్తులకుభాగ్యం కల్పించారు కుటమి ప్రభుత్వం వచ్చినాక ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి అమ్మవారి ప్రభుత్వం గుర్తించినందుకు ఆర్యవైశ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు చేగు రాము సెక్రెటరీ పసుమర్తి సుబ్బారావు సుబ్బారావు వంగేటిబాబు గౌరవ అధ్యక్షులు పారేపల్లి రాధాకృష్ణఉపాధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాసరావు పులిపాటి పవన్ కుమార్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో విచారణ జరిపి వెబ్ ల్యాండ్‌లో సక్రమంగా నమోదు చేయాలి

**కర్లపాలెం,జనవరి20,ప్రభాతవార్త:** వెబ్ ల్యాండ్ లో ఇతరులు కేటగిరి కింద ఉన్న భూమికి యజమానులను గుర్తించి వారి పేరుతో ఆన్ లైన్ లో నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు.వెబ్



ల్యాండింగ్ లో ఇతరుల కేటగిరి కింద నమోదైన భూములను కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో 6,516 ఎకరాల భూమి ఉండగా, ఇతరుల కేటగిరిలో 2,764 ఎకరాల భూమి ఉండడంపై కలెక్టర్ ఆరా తీశారు. భూమి ఎవరిదో తెలియకుండా వెబ్ ల్యాండ్ లో ఇతరులు అనే కేటగిరి కింద ఎలా నమోదు చేశారని ప్రశ్నించారు. వెబ్ ల్యాండ్ లో జరిగిన నమోదు ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో, భూముల రీ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఒక గ్రామంలోనే ఇతరులు కేటగిరీలో వేల ఎకరాలు ఉండడంపై రెవెన్యూకు సంబంధించిన భూముల దస్త్రాలను పరిశీలించారు. వెబ్ ల్యాండ్ తెరిచి చూశారు. అనంతరం క్షేత్రస్థాయిలోకి వెళ్లి భూములను పరిశీలించారు. 590 సర్వే నెంబర్ కింద ఆవుల నాగేశ్వరరావుకు సంబంధించిన ఎనిమిది ఎకరాల భూమి ఉందని, తల్లిదండ్రుల పిత్రార్జితంగా వచ్చిన భూమిని పంచుకోకపోవడంతో ఈ సమస్య వచ్చిందని గుర్తించారు. సంబంధిత రైతులతోనూ ఆయన మాట్లాడారు. మరో 85 సెంట్లు భూమి అదే సర్వే నంబర్ లో ఉందని, వాటిని పంచుకోవాల్సి ఉందని రైతులు కలెక్టర్ కు వివరించారు. ఆ భూములను సర్వే చేయాలని, గ్రామాలలో విచారణ జరిపి వెబ్ ల్యాండ్ లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.

## చేనేత బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

**భటిప్రోలు(రేపల్లె), జనవరి 20, ప్రభాతవార్త:** చేనేత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ విమర్శించారు.మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద చెల్లించాల్సిన రూ.20 కోట్ల బకాయిలలో కేవలం రూ.1.67 కోట్లు మాత్రమే చెల్లించడం విచారకరమన్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరం నుండి చేనేత సహకార సంఘాలకు ఆయా పథకాలకు




సంబంధించి రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1.67 కోట్లు నిధులు బ్యాంకు ఖాతాలో జమచేశారని బాలాజీ పేర్కొన్నారు.బకాయిలు గురించి ప్రస్తావించకపోవడం దురదృష్టకరమన్నారు.ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ మాటాడుతూ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు 2013-14 ఆర్థిక సంవత్సరం నుండి పావలా వడ్డీ,నూలు సబ్సిడీ,రిబేటు, త్రిఫ్ట్‌ఫండ్,మార్కెటింగ్ ఇన్సెంటివ్ పథకాల ద్వారా చెల్లించాల్సిన రూ.200 కోట్ల బకాయిలు ఎప్పుడు మంజూరు చేస్తారని ప్రశ్నించారు.సహకార సంఘాలలోని వస్త్ర నిల్వలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి తక్షణమే నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు కౌతరపు పార్థసారథి,కె.వీరమోహన్‌రావు, ఆకురాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 18 సంవత్సరాల నిండి,డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలి

### - ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలి - జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె.పరంధామ రెడ్డి

**బాపట్ల,జనవరి20,ప్రభాతవార్త:** పరిణతి చెందని వయసులో వాహనాలను నడిపి ప్రమాదాలకు గురి కావద్దని జిల్లా రవాణా శాఖ అధికారి టి. కె . పరంధామ రెడ్డి విద్యార్థులకు చూచించారు.రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ నందు విద్యార్థులకు రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రులు తమ పిల్లలకు సరైన వయసు రాకుండానే వాహనాలను నడిపేందుకు అనుమతించడం చాలా ప్రమాదకరమన్నారు. పిల్లలు ప్రమాదాలకు గురైతే వారి తల్లి తండ్రుల పరిస్థితి దయనీయంగా మారుతుందనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించలని విద్యార్థులకు తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలను నడపాలన్నారు.వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవలని విద్యార్థులను ఆదేశించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి.బి. రంగారావు విద్యార్థులకు రోడ్డు రూల్స్ పై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ ఎ. నరేంద్ర కుమార్ ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. కిషోర్ బాబు, శ్రీ చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ పి. మోహన్ రావు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పందుల సంచారాన్ని అరికట్టలేని అధికార యంత్రాంగం

**రేపల్లె,జనవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలో పందుల సంచారం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు.ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు హడావుడిగా పందుల



పెంపకందారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని లేదంటే పందులను అడవులకు పంపించేస్తామని హెచ్చరికలతో సరిపెట్టడం విమర్శలకు తావిస్తోంది. రేపల్లె పట్టణంలో విచ్చలవిడిగా పందులు సంచరిస్తున్న కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నివాసాల వద్ద ఇబ్బందికరంగానే ఉంటోందని ప్రజలు వాపోతున్నారు.పందులు రోడ్లపై తిరగడం వలన పరిసరాలను అపరిశుభ్రం చేయడంతో పాటు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పందుల కారణంగా మెదడువాపు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. గుంపులు గుంపులుగా తిరిగే పందుల వలన పాదచారులు,వాహన చోదకులు భయపడుతున్నారు. పట్టణంలో పందులు తిరగకుండా రేపల్లె మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి తాగునీరు

**నగరం,జనవరి20,ప్రభాతవార్త:** జలజీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడం జరుగుతుందని టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ అన్నారు.మంగళవారం స్థానిక మండల పరిధిలోని కారంకివారి పాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి త్రాగునీరు,రోడ్లు, మౌలికవసతులు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అమలుచేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ జనసేన పీఓసీ మత్తి బాస్కరావు,ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహశీల్దార్ జి.నాంచారయ్య, సంఘం డైరీ డైరెక్టర్ బుజ్జి,టీడీపీ మండల అధ్యక్షులు చింతల సుబ్బారావు,మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య,మాజీ జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ,జడ్పీటీసీ మాన్యం నాగ మణి,లుక్కా గుడారంకయ్య,వైవీఎన్ ప్రసాద్ ,చలమయ్య,ప్రజలు పాల్గొన్నారు.



## తక్కువ పెట్టుబడితో అధిక లాభం సాధించాలి

**నగరం,జనవరి20,ప్రభాతవార్త:** తక్కువ పెట్టుబడితో అధికలాభం సాధించాలని రేపల్లె వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిధిలోని ఈదుపల్లి,మీసాలవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్‌లో అపరాలు ఎక్కువగా సాగుచేయటం జరుగుతుందని,మినుము పంటలో ప్రధానంగా కలుపు సమస్యలు ఉండే అవకాశం ఉందని ,పంట వేసిన 20నుండి 25 రోజుల్లో ఊద,గరిక ,చిప్పెరగడ్డి జాతి మొక్కలు నిర్మూలనకు ఫైనాక్సాఫాప్ ఇథైల్9శాతం ద్రావకం 250ఎమ్ఎల్,ఎకరాకు లేదా 400ఎమ్ఎల్ చొప్పున ఎకరాకు పిచికారి చేసి నావారించవచ్చు అని తెలిపారు.రెండు నుండి నాలుగు ఆకుల దశలో ఇమిజితాఫిర్ 5శాతం ద్రావకం మందును 200ఎమ్ఎల్ పిచికారి చేస్తే సమర్ధవంతంగా కలుపు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.రమేష్,వ్యవసాయ విస్తరణాధికారి నాగశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## శాంతి,అహింసలకు ప్రతిరూపం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**బాపట్ల,జనవరి20,ప్రభాతవార్త:** శాంతి, అహింసలకు ప్రతిరూపం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మాఘ శుద్ధ విదియ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన



అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా ఎస్పీ అమ్మవారిని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ వృత్తాంతం భారతీయ సంస్కృతిలో ఒక అద్వితీయ ఘట్టమని, అది సమాజానికి శాంతి మరియు అహింసల మార్గాన్ని బోధిస్తుందన్నారు. లోక కళ్యాణం కోసం, స్త్రీజాతి ఆత్మగౌరవ పరిరక్షణ కోసం అమ్మవారు చేసిన త్యాగం నేటి కాలానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆయుధాల ద్వారా వచ్చే విజయం కంటే, ఆత్మబలంతో సాధించే అహింసా మార్గమే శ్రేష్ఠమని అమ్మవారు ఆనాడే నిరూపించారన్నారు. విష్ణువర్ధనుడి బలప్రయోగాన్ని ఎదిరించడంలో అమ్మవారు చూపిన ధైర్యం, యుద్ధం వల్ల జరిగే రక్తపాతాన్ని నివారించేందుకు ఆమె ఎంచుకున్న ఆత్మార్పణ మార్గం సామాజిక శాంతి పట్ల ఆమెకు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెబుతుందని తెలిపారు. నేటి సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరరహిత సమాజ స్థాపనకు అమ్మవారి బోధనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ చారిత్రక ఘటనను విశ్లేషిస్తే, మహిళా భద్రత మరియు సామాజిక బాధ్యత వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. పోలీస్ శాఖ పరంగా ప్రజల రక్షణకు, నేరాలను నివారించేందుకు అమ్మవారు చూపిన తెగువ ఆదర్శనీయమన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు సమాజం పట్ల సేవాభావంతో వ్యవహరిస్తూ, ప్రజల రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. చట్టాన్ని గౌరవిస్తూ, ధర్మబద్ధంగా జీవించడం ద్వారానే నిజమైన ప్రశాంతత లభిస్తుందని, బ్రహ్మకుండం వంటి పవిత్ర క్షేత్రాలు సమాజానికి నైతిక విలువలను అందించే స్ఫూర్తి కేంద్రాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఓ బి. శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ పి. విజయసారధి, అడ్మిన్ ఆర్ఐ మోలుద్దీన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ కె. భుజంగరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**పిట్టలవానిపాలెం,జనవరి20,ప్రభాతవార్త:** యువత డ్రగ్స్,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ అన్నారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ రెడ్డిపాలెం టోల్ గేటు వద్ద ప్రజలకు మంగళవారం పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత ఏ విధంగానైన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివలన శారీరక మానసిక



ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అలానే సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాటలు ఇతర జూదాలకు సంబంధించిన క్రీడలు ఆడరాదని తెలియపరిచారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దన్నారు. దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్వి చక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## వేరుశనగ పంటను పరిశీలించిన ఎఓ

**నిజాంపట్నం, జనవరి 20, ప్రభాతవార్త:** మండలంలో వేరుశనగ పంటపై రసం పీల్చు పురుగు ఆశించిందని ఎఓ విజయరాజు అన్నారు. మంగళవారం మండలంలోని దిండి పంచాయితీలోని వివిధ గ్రామాలలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రసం పీల్చు పురుగువల్ల మొక్కలు గిడసబారుతున్నాయని వాటి నివారణకు తయోమితాక్సిమ్/ఇమిడాక్లోఫ్రైడ్ 250 మి.లీ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పైరుకు ఆరుతడిగా నీరు పెట్టాలన్నారు. తెగుళ్ళ నివారణకు ఎకరాకు ప్రొపికొంజోల్ 250 మి.లీ పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఓలు, రైతులు పాల్గొన్నారు.



# మంత్రి మనోహర్‌తో ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యుల సమావేశం

**తెనాలి మున్సిపాలిటీ జనవరి20(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ మంత్రి,స్థానిక శాసనసభ్యులు,నాదెండ్ల మనోహర్ తో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్,తెనాలి డివిజన్ మరియు ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్టింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు మంగళవారం మంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ కి ఫెడరేషన్ సభ్యులు శాలువా కప్పి,బొకే తో సన్మానించారు.ఈ సందర్భంగా,జర్నలిస్టుల సమస్యలను మంత్రి నాదెండ్ల దృష్టి తెచ్చారు.తెనాలి లో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు చొరవచూపాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ,తెనాలి పట్టణ జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో తెనాలి ప్రాంత అభివృద్ధికి పలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.అలాగే పట్టణ సమస్యలను తనదృష్టికి తీసు కురావాలని జర్నలిస్టులను కోరారు.ఈ సమావేశంలో,తెనాలి డివిజన్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్,అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్,కార్యదర్శి అచ్యుత సాంబ శివరావు,బ్రాడ్ కాస్టింగ్ నాయకులు, మాజీ అధ్యక్షులు ఎం. రవికుమార్,డి. కోటేశ్వరరావు ఎస్.ఎస్.జహీర్,జి. ప్రభాకరరావు,డి రమేష్, షణ్ముఖేశ్వరరావు,పి. పున్నయ్య,ఎన్.జె.శామ్యుల్, వి.లక్ష్మణరావు,వి.నాయుడు, డి.వెంకటేశ్వరరావు,డి. నాగరాజు,కరేటి సాంబశివరావు,పి. శ్రీనివాసరావు, ఎం. మల్లేశ్వరరావు,పి.మధు, సిహెచ్.మణి కుమార్,జె. వెంకట సిద్దార్ధ,కె.నాగరాజు, ఎం.సుబ్బారావు, వి.భూషణం, ఎం.తిరుమలేశ్వర రావు,ఎస్. సుభాష్ బాబు,ఎం.శ్రీకాంత్,ఎ. సంజయ్ పాల్గొన్నారు.



# శ్రీ వాసవిమాతను ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు తథ్యం : మోహన శ్యామ్‌ప్రసాద్

## -రూ.3 లక్షలతో రూపొందించిన విగ్రహం ఆవిష్కరణ

**కొల్లిపర, జనవరి 20, ప్రభాతవార్త:** అహింస,ధర్మం,మహిళల గౌరవాన్ని చాటిచెప్పిన పరాశక్తి స్వరూపమై ఆర్యవైశ్యుల కులదేవతగా విరాజిల్లుతున్న శ్రీ వాసవిమాత కరుణా కటాక్షాలు భక్తులపై ఉండాలని తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ళు అధినేత మునగాల మోహన శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు.కొల్లిపర ఆర్యవైశ్య సంఘ నిలయంలో మంగళవారం శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వాసవిమాత విగ్రహ ప్రథమ పూజా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మునగాల మోహన శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పార్వతి దేవి,ఆదిశక్తి స్వరూపంగా భావించే శ్రీ వాసవి మాత అగ్నిలోకి ప్రవేశించి అవతారాన్ని ముగించిందన్నారు.శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం విశేషమన్నారు.శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారిని ఆరాధించే భక్తులకు శాంతి, సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు లభించడం మహిమాన్వితమని ఆయన వివరించారు. శ్రీ వాసవిమాత విగ్రహం కోసం అన్నవరపు రమేష్, మునగాల రామారావు, చుండూరు వెంకట రత్నంలు రూ.3 లక్షలు విరాళమివ్వడం అభినందనీయమని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.శ్రీ వాసవిమాత విగ్రహాన్ని తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ళు అధినేత మునగాల మోహన శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు.నూతన శుభమస్తు వేదిక,నూతన మినీ హాల్ షెడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు, కార్యదర్శుల ఫొటో ఆవిష్కరించారు.విరాళ దాతలను సత్కరించారు. కొల్లిపర వాసవి క్లబ్ ప్రమాణ స్వీకారం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు, అధ్యక్షుడు అన్నవరపు రమేష్,ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి,చుండూరు వెంకటరత్నం, సహాయ కార్యదర్శి బొలిశెట్టి హరీష్,కోశాధికారి కాజా శివ వెంకట శివప్రసాద్,సుగ్గుల సురేష్,అధిక సంఖ్యలో మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# సచివాలయం ఉద్యోగులు సవ్యంగా పనిచేయాలి

**కొల్లిపర, జనవరి 20, ప్రభాతవార్త:** విధుల నిర్వహణ విషయంలో సచివాలయం ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరించాలని ఎంపిడివో విజయలక్ష్మి ఆదేశించారు.మంగళవారం మండలంలోని చివలూరు, అత్తోట,తూములూరు గ్రామాలలోని సచివాలయాలను డిప్యూటీ ఎంపిడివో దానయ్యతో కలసి తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. సచివాలయాలలో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత,క్లోరినేషన్,యునైటెడ్ ఫ్యామిలీ సర్వే వివరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి తగిన విధంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు.ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆమె చెప్పారు.సత్వరమే ప్రజల సమస్యలను పరిష్కరించాలని విజయలక్ష్మి సూచించారు.సిబ్బంది విధినిర్వహణ సవ్యంగా లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.గ్రామాలలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడాలని ఆమె కోరారు.



# పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం అందజేత

**పొన్నూరు, జనవరి 20,ప్రభాతవార్త:** గత ఏడాది పిడుగుపాటుకు గురై మృతి చెందిన రైతు కూలీల కుటుంబానికి కూటమి ప్రభుత్వం మానవీయ నిర్ణయంతో బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని అందజేసిందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చెప్పారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన రైతు కూలీలు వలపర్ల కమల భర్త సోమయ్య, 27వ వార్డుకు చెందిన షేక్ ముజాహిత భర్త బాజిలు గత ఏడాది అక్టోబరు 22న వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో పిడుగుపాటు కారణంగా దురదృష్ట వశాత్తు మృతి చెందడం జరిగింది. ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం స్పందించి విపత్తుల శాఖ ద్వారా మృతి చెందిన కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో మంజూరు చేయడానికి పరిపాలనా అనుమతి ఇచ్చిన జీవో కాపీలను స్థానిక టిడిపి నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ మొత్తాన్ని డిబిటి విధానం ద్వారా నేరుగా బాధితుల ఖాతా నెంబరులో జమ అవుతాయని నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, ఎద్దు సోంబాబు, చలమశెట్టి సీతారామయ్య, ఆరె వరప్రసాద్, చెన్నుపాటి భాస్కర్, మగ్బుల్‌బేగ్, బాబ్జి, మహమ్మద్ గౌస్ తదితరులున్నారు.



# పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

## పెదనందిపాడు ఏడి, ఏవీహెచ్ డాక్టర్ సైలజ

వట్టిచెరుకూరు, జనవరి 20, ప్రభాతవార్త : రైతులు పశు భీమా పథకంపై అవగాహన పెంచుకొని పశువుల సంరక్షణను చేపట్టాలని పెదనందిపాడు ఏడి, ఏవీహెచ్ డాక్టర్ ఎన్. శైలజ పేర్కొన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం అనంతవరప్పాడు లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పెదనందిపాడు ఏడి డాక్టర్ శైలజ పాల్గొని మాట్లాడుతూ..రాష్ట్రంలో పశుపోషణ చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉండే విధంగా ఉచిత పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పశువుల పోషణ, ఆరోగ్య పరిరక్షణ, పశుగ్రాసాల పెంపకం, యాజమాన్య రక్షణతో పాటు వివిధ పరీక్షలు నిర్వహించేందుకు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. ఈనెల 19 నుంచి 31 వరకు ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని పశువులకు సంబంధించి పరీక్షలు పొంది అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ప్రత్తిపాడు నియోజవర్గంలో ఎంతో మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. భవిష్యత్తులో పశు పోషణ పెంచి వారి ఆదాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా పశువులకు సంబంధించి బీమా సదుపాయం రైతులు కేవలం 15 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. గోకులం షెడ్లు నిర్మాణం ద్వారా 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.రూ. 288ల భీమాతో మేలు జాతి పశువులు పశు బీమా పథకంలో చనిపోతే అక్షరాల రూ.30వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. నాటు పశువులకు రూ.144లతో బీమాతో పశు బీమా పథకంలో చనిపోతే అక్షరాల రూ.15వేలు ప్రభుత్వం అందిస్తుందని, దీనికి ఎస్సీ, ఎస్టీ దారిద్ర్యరేఖకు దిగునున్నవారు కూడా అర్హులేనని తెలియజేశారు. ప్రీమియం చెల్లించి బీమా పొందండని వివరించారు. 20 గేదలు, 16 దూడలు, 20 గొర్రెలకు నట్టల నివారణ మందు, 12 పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. కోటేశ్వరమ్మ, జేవివో ఝాన్సీ రాణి, ఏహెచ్ఏ హేమలత, ఓఎస్ పెదబాబు, అలాగే వింజనంపాడు లో జరిగిన పశు వైద్య శిబిరంలో కాట్రపాడు పశు వైద్యాధికారి డాక్టర్ భవ్యశాంతి, జిఎం మురహరి, ఏహెచ్ఏలు సతీష్, ఖాదర్, ఓఎస్ పుష్పభాయ్, ఉప సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు సుజాత, పశు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# ట్యూషన్ సెంటర్‌కు క్రీడా వస్తువులు బహుకరణ

పెదనందిపాడు జనవరి 20: (ప్రభాతవార్త)పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామంలో దాతల సహకారంతో ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్ కు సహాయ సహకారాలు అందించిన మోటూరి హనుమంతరావు మెమోరియల్ ట్రస్ట్ వారికి తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అభినందనలు ,కృతజ్ఞతలు తెలియజేశారు మంగళవారం సాయంత్రం ట్యూషన్ సెంటర్ కు మోటూరి హనుమంతరావు మెమోరియల్ ట్రస్ట్ వారి సహకారంతో ఆట వస్తువులు క్యారమ్స్, చెస్ ,చైనీస్ చక్కర్, రింగ్స్ ,స్కిప్పింగ్స్ ,షటిల్ బ్యాట్స్, కాక్స్ తదితర ఆట వస్తువులు రమేష్ బాబు,జంపని రామారావులు అందజేశారు .పాలపర్రులోని పాత పాత బాపట్ల తాలూకా మృతవీరుల స్మారక భవనంలో గత పది నెలలుగా ట్యూషన్ సెంటర్ పలువురు దాతలు సహకారంతో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని రమేష్ బాబు తెలిపారు.ఎల్.కె.జి. నుండి పదవ తరగతి వరకు, వివిధ పాఠశాలలో చదువును అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఈ ట్యూషన్ సెంటర్ కు వస్తున్నారని. ట్యూషన్ సెంటర్ కు సహకారం అందిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.దాతల సహకారం ఇకపై కూడా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మోటూరి హనుమంతరావు మెమోరియల్ ట్రస్ట్ వారు సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ , మోటూరి హనుమంతరావు మెమోరియల్ ట్రస్ట్ వారు ట్యూషన్ సెంటర్ కు వివిధ రకాల ఆటవస్తువులతో పాటు, ట్యూటర్స్ కు గౌరవ వేతనం,స్నాక్స్ కు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని ,ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.దాతల సహకారంతో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్ ను పాలపర్రు ,రాజుపాలెం, అన్నవరం గ్రామాల విధ్యార్థులు ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు.ట్యూషన్ సెంటర్ లో జరిగిన కార్యక్రమం లో ట్యూటర్లు ఇనగంటి నవీన్, షకీల,సుష్మిత పాల్గొన్నారు. విద్యార్థులు ఉచితంగా ట్యూషన్ నిర్వహించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**బాపట్ల,జనవరి17,ప్రభాతవార్త:** జిల్లాలోని యువతకు నైపుణ్య శిక్షణలు అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పీఎంకేవైతో పాటు ఇతర నైపుణ్య శిక్షణ కార్యక్రమాల అమలు, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి ప్రోగ్రాములు, ప్రాథమిక రంగంలో శిక్షణ అవకాశాలు, ఉద్యోగ మేళాల నిర్వహణ అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. అలాగే పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రస్తుత స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. నైపుణ్య శిక్షణలు నిరంతరాయంగా కొనసాగాలని, యువతకు నాణ్యమైన శిక్షణలు అందించి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి మాధవి, ఆర్టీసీ ఆర్ఎం విమల, డీఆర్‌డీఏ పీడీ సింగయ్య, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# నేటి నుంచి ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఎంఆర్ నెట్‌వర్క్ సమావేశం

**మంగళగిరి, జనవరి20, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం నుంచి ఇండియాయూకే దేశాల పరిశోధనా రంగ నిపుణులతో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై ప్రత్యేక సమావేశం జరుగనుంది. ఈ కీలక సమావేశానికి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అతిధ్యమిస్తోంది. ఏఎంఆర్ వాడకం, వ్యాధి నిరోధకతపై పరిశోధనలు, వీటిని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ



## హాజరవుతున్న ఇండియా యూకే నిపుణులు

సమావేశానికి ఇండియా, యూకే దేశాల నుంచి పరిశోధకులు, వైద్యులు, పశువైద్య రంగ నిపుణులు, ప్రజారోగ్య ప్రముఖులు హాజరవుతున్నారు. ఏఎంఆర్ పై ఈ రెండు దేశాల నిపుణుల మధ్య సహకారం పెంపొందిచడమే సమావేశపు ప్రధాన ఉద్దేశమని సమావేశ పర్యవేక్షకులు డాక్టర్ జయశీలన్ మురుగయ్యన్ పేర్కొన్నారు. యూకే లోని లీడ్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ సువర్ణ మిత్రా, డాక్టర్ మహుదా రాస్, బోస్ ఇనిస్టిట్యూట్ అండ్ యూనివర్సిటీ ఆఫ్ ఖుర్వాన్ నుంచి డాక్టర్ జముర్ ఘోష్, ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ శోభనలు ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశానికి విచ్చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా సీఎస్ఐఆర్ (నాగ్ పూర్), ఢిల్లీ జేఎన్టీయూ, ఐఐటీ కాన్పూర్, జిందాల్ యూనివర్శిటీ, చెన్నై కెన్సర్ ఇనిస్టిట్యూట్ నుంచి నిపుణులు కూడా హాజరవుతున్నారని డాక్టర్ జయశీలన్ వివరించారు.

# కెఎల్‌యులో ప్రారంభమైన అఖిల భారత అంతర్ యూనివర్సిటీల బ్యాడ్మింటన్ సెమీ ఫైనల్స్

**తాడేపల్లి,జనవరి 20,ప్రభాతవార్త :** కెఎల్ విశ్వవిద్యాలయంలో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్--2026 మంగళవారం సెమీ ఫైనల్ క్రీడలు ప్రారంభమయ్యాయి.ఈ క్రీడలు బుధవారం ఉదయం పూర్తవడంతోపాటు బుధవారం మధ్యాహ్నం ఫైనల్ క్రీడలు జరుగుతాయని సౌత్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు.ఈ నేపథ్యంలో మంగళవారం సెమీ ఫైనల్ క్రీడల్లో 8జట్లు పోటీపడుతున్నట్లు డాక్టర్ హరికిషోర్ తెలిపారు.సెమి ఫైనల్ క్రీడలు పూర్తయ్యాక ఫైనల్ పోటీలు జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా యూనివర్సిటీల పరిశీలకులు మనోజ్‌కుమార్, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారది వర్మ,ప్రొఫెసర్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జీ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్,వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.



# సుప్రీంకోర్టు తీర్పు రిజర్వేషన్ వర్గాల పాలిట వరం : కేశన శంకరరావు

తాడేపల్లి,జనవరి 20,ప్రభాతవార్త : రిజర్వుడు కేటగిరి అభ్యర్థులు జనరల్ కేటగిరి కటాఫ్ మార్కుల కన్నా ఎక్కువ సాధించినప్పుడు,వారిని ఓపెన్ క్యాటగిరి కింద సర్దుబాటు చేయాలంటూ ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ వర్గాల పాలిట వరమంటూ,ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు "బిసి బంధు" కేశన శంకరరావు అహీర్ అన్నారు.ఆ మేరకు వారు హర్షం ప్రకటిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.ఇంకా వారు ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి రిజర్వేషన్లకు అర్హమైన ఎస్సీ,ఎస్టీ,ఓబిసి వర్గాలకు చెందిన అభ్యర్థులు,జనరల్ కేటగిరి కటాఫ్ మార్కుల కన్నా ఎక్కువ మార్కులు సాధించినప్పుడు వారిని ఓపెన్ లేదా రిజర్వేషన్ లేని కేటగిరికి చెందిన వారిగా పరిగణించాలనే ప్రముఖ న్యాయసూత్రాన్ని పాటించిన సుప్రీం ధర్మాసనానికి ధన్యవాదలన్నారు.ప్రతిభావంతులైన అణగారిన వర్గాల అభ్యర్థుల తరపున కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు.అందుకు భిన్నంగా 2020లో ఆనాటి కేరళ హైకోర్టు జారీ చేసిన ఆదేశాన్ని,ఈనాటి సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేయడం రిజర్వేషన్ వర్గాలకు సంతోషదాయకమన్నారు.రిజర్వేషన్ లేని ఓపెన్ క్యాటగిరి అనేది రిజర్వేషన్ వర్తించని వర్గాల కోసం ఏర్పాటు చేసిన కోటా కాదని,అది ప్రతిభ మాత్రమే ప్రాతిపదికంగా ఉన్న అభ్యర్థుల సమూహం కోసం ఏర్పాటు చేయబడింది అంటూ కోర్టు వ్యాఖ్యానించడం ప్రతిభావంతులైన అట్టడుగు వర్గాల అభ్యర్థుల కెంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.ప్రతిభ ఆధారంగా పోస్టులు కేటాయించబడుతున్నప్పుడు ప్రతిభావంతులైన రిజర్వుడు వర్గాల వారికి ఆ అవకాశం దక్కనీయకపోవడం చట్టం ముందు అందరూ సమానులే అన్న ఆర్టికల్-14 రాజ్యాంగ ప్రకరణాన్ని దిక్కరించడమే అవుతుందన్నారు. అంతేగాక మేధావులైన కొందరు రిజర్వుడు అభ్యర్థులకు ప్రతిభ ఆధారిత కేటగిరిలో వారి ప్రతిభ ఆధారంగా భర్తీ చేసే పోస్టులు కేటాయించకపోవడం ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో అందరికీ సమానత్వాన్ని కల్పించిన ఆర్టికల్ 16 రాజ్యాంగ ప్రకరణాన్ని ధిక్కరించడమే అవుతుందన్నారు.ఈ కారణంతో ఇప్పటివరకు ప్రతిభావంతులైన రిజర్వుడు అభ్యర్థులకు అనేక రంగాల్లో విద్య-ఉద్యోగ అవకాశాల్లో ఎంతో అన్యాయం జరిగిందన్నారు.ఈనాటి సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విభాగాల్లో స్థానాల భర్తికి ఇదే విధానాన్ని ఖచ్చితంగా అమలు జరిపి,బిసి,ఎస్సీ,ఎస్టీ వర్గాలవారికి సామాజిక న్యాయంతోపాటు సమన్యాయమందించాలని శంకరరావు పాలకవర్గాలకు విజ్ఞప్తి చేశారు.



# బహుమతులు ప్రదానం

**కాకుమాను జనవరి 20(ప్రభాతవార్త :** మండల కేంద్రం కాకుమాను గ్రామంలో ఇటీవల ఘనంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాల సందర్భంగా,నన్నపనేని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.ఈ సంబరాల్లో భాగంగాసాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు,అలాగే వాలంటీర్లుగా సేవలందించిన విద్యార్థులకుకారుమంచి ప్రసాద్ బాబు సౌజన్యంతో బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో సంక్రాంతి సంబరాల నిర్వహణలో విశేష సేవలందించిన సందర్భంగాగ్రామ సర్పంచ్ బి. ప్రసాద్ ,మహిళా మండలి చైర్మన్ సత్యవతి ,ప్యారి జాన్ ,రిటైర్డ్ బయాలజీ టీచర్ మక్కెన జవహర్ రాణి ,వాలంటీర్ ఆశా ,నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.అలాగే గత మూడు సంవత్సరాలుగా పాఠశాలలో కారుమంచి ప్రసాద్ బాబు సౌజన్యంతో వాలంటీర్ గణిత ఉపాధ్యాయుడిగా సేవలందించి, ప్రస్తుతం నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ గా ఉద్యోగంలో చేరనున్న సందర్భంగా నాగేశ్వరరావు కి వీడ్కోలు సత్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నల్లమోతు పూర్ణ చంద్రయ్య ,ప్రధానోపాధ్యాయులు జి. భాస్కర వీర వెంకట రావు ,పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సంస్కృతి, సంప్రదాయం, సేవాభావం కలగలిసిన ఈ వేడుకలు అందరికీ మధుర జ్ఞాపకంగా నిలిచాయి.



# ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మాహుతి వేడుకలు

**పెదనందిపాడు జనవరి 20 (ప్రభాతవార్త):** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మహుతి దినోత్సవం సందర్భంగా మంగళవారం పెదనందిపాడు అమ్మవారి దేవాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు. గణపతి పూజ. 108 సార్లు లక్ష్మి గణపతి దుర్గా సూక్తం. అమ్మవారి మూల మంత్రం 20 మంది దంపతులచే నవగ్రహ హోమాలు. పూర్ణాహుతి మంగళహారతి కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు పట్టస్వామి ఉదయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తొమ్మిది రకాల పుష్పార్చన. లలిత సహస్ర నామార్చిన అనంతరం విశేష హారతులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు దాసరి శేషగిరిరావు. అరవపల్లి కృష్ణ. కొత్త శ్రీధర్ .అరవపల్లి రాంబాబు దంపతుల సహకారంతో. అమ్మవారి గోత్రికులు తన్నీరు సుబ్బారావు సీతామహాలక్ష్మి దంపతులు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.





# హెల్త్‌కేర్ వర్కర్స్ సంరక్షణ చర్యలు తీసుకోవాలి

## - ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్‌లో ముగిసిన కార్యశాల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి20, ప్రభాతవార్త: నేటి వైద్య రంగంలో నాణ్యమైన సేవలతో పాటు హెల్త్‌కేర్ వర్కర్స్ సంరక్షణా పద్ధతులను పాటించాలని నేషనల్ హెల్త్‌మిషన్ స్టేట్ కన్సల్టెంట్ జ్యోతి రెడ్డి అన్నారు. ఏఎన్‌యులోని ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జరుగుతున్న రెండు రోజుల కార్యశాల మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య బట్టు నాగరాజు అధ్యక్షత వహించారు. జ్యోతి రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రులు స్వీయ సంరక్షణ పద్ధతుల వలన చాలావ్యాధులు ఒకరినుంచి మరొకరికి సోకకుండ కట్టడి చేయడం సాధ్యమేనన్నారు. అటువంటి ప్రమాణాలను ఎన్ఎబిహెచ్ ప్రామాణికాలుగా సూచించిందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రతీ ఆసుపత్రి ఎన్ఎబిహెచ్ ప్రమాణాలు పాటించాలన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ క్వాలిటీ కన్సల్టెంట్ అడపా వాసుబాబు మాట్లాడతూ నాణ్యతా ప్రమాణాలను ఏ విధంగా అంచనావేయాలో తద్వారా రోగులకు సంపూర్ణమైన నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ఆసుపత్రులు పాటించాల్సిన ప్రమాణాలను వివరించారు. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ క్వాలిటీ కోఆర్డినేటర్ పి.వినోద్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ సక్రమమైన పద్దదుల్లో చేపట్టిన రోజే ఆసుపత్రులు మంచి వాతావరణాన్ని అందిస్తాయన్నారు. బట్టు నాగరాజు మాట్లాడుతూ రెండు రోజుల కార్యశాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అనంతరం పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు కార్యశాలలో ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ జి.దేవిడ్‌రాజు, డా.సాధిక్, డా.బి.శ్రీధర్ రెడ్డి, డాక్టర్ చుండి ప్రసాద్, ఏఎన్‌యు ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్,హిందూ కళాశాల విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



# ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు కీర్తి సురేష్ ప్రమోషన్

**అమరావతి, జనవరి 20, ప్రభాతవార్త :** ఈ సంక్రాంతికి మంచివాటిని ఎంచుకొని, మంచిగా తినండని సినీనటి కీర్తిసురేష్ ప్రోత్సహిస్తోంది. ఏపి, కర్ణాటక, తెలంగాణల్లో సంక్రాంతి సందర్భంగా, ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో కీర్తిసురేష్ పాల్గొన్నారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బంజ్ ఇండియా తెలిపారు. ఫియోనా యొక్క విటో ప్రొటెక్ట్ ఫార్ములా ఆరోగ్యం సంరక్షిస్తుందన్నారు.

# 22న విజ్ఞాన్స్‌లో ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్-2026

**-ప్రత్యేక ఆకర్షణగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026**
**-ముఖ్య అతిథిగా శ్రీహరికోట షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్**
**-గౌరవ అతిథులుగా ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, డాక్టర్ జీ.సతీష్‌రెడ్డి, ఏపీ మంత్రి బీసి జనార్ధన్‌రెడ్డి**

**పొన్నూరు, జనవరి 20,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం,వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026ను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కెవి క్రిష్ణకిషోర్ మంగళవారం తెలిపారు. ఈ సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్ ఆవిష్కరించారు.సమ్మిట్‌కు శ్రీహరికోటలోని సతీష్




ధావన్ స్పేస్ సెంటర్(షార్) డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఇంచార్జి వీసి వెల్లడించారు. అదేవిధంగా ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జీ.సతీష్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ రోడ్లు, భవన నిర్మాణాలశాఖామంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొననున్నట్లు తెలిపారు.అదేవిధంగా అమరావతిలోని సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్2026ను కూడా మూడు రోజులపాటు ఇదే సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కళాశాల స్థాయి విద్యార్థులకు కెమికల్ రాకెట్రీ, స్కూల్‌స్థాయి విద్యార్థులకు హైడ్రో రాకెట్రీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్‌ను లివరేజింగ్ స్పేస్ టెక్నాలజీ ఫర్ వికసిత్ భారత్-2047అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతరిక్ష సాంకేతిక రంగంలో పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమ-అకాడెమి కలయికలను ప్రోత్స హించడం లక్ష్యంగా ఈ సమ్మిట్ కోసం విశాలమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భారత అంతరిక్ష కార్యక్రమం 1960లో ప్రారంభమై, దేశ అభివృద్ధికి అంతరిక్ష సాంకేతికతను వినియోగించడం ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని గుర్తు చేశారు. అదే దిశగా రాష్ట్రంలో అంతరిక్ష రంగ అభివృద్ధి ద్వారా సువర్ణ ఆంధ్రప్రదేశ్ వికసిత్ భారత్-20247 లక్ష్యాలను సాధనకు అవసరమైన నైపుణ్యాలు, నవీన ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించడం ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశమన్నారు.

**సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026 ప్రధాన ఆకర్షణ:** సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026లో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్, పాలిటెక్నిక్ విద్యార్థి బృందాలు పాల్గొననున్నాని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా చిన్న రాకెట్ల నమూనాలను రూపకల్పన చేసి, తయారు చేసి, లాంచ్ చేయడం ద్వారా రాకెట్ డిజైన్, ఎరోడైనమిక్స్, ప్రొపల్షన్, ఫ్లైట్ స్టెబిలిటీ వంటి అంశాలపై ప్రాయోగిక అవగాహనను పెంపొందించుకోగలరన్నారు. రాకెట్ యొక్క రేంజ్, ఎత్తు, స్థిరత్వం, డిజైన్ ఇన్నోవేషన్, సేఫ్టీ ప్రోటోకాల్ వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రత్యేక ట్రోఫీలు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో కేసినేని వెంకట్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# ఉత్తరాయణంలో భక్తుల కోరికలు తీర్చే మాఘమాసం

**రాజశ్యామల నవరాత్రులు,వసంత పంచమి,రథసప్తమి,భీష్మ ఏకాదశి,మహాశివరాత్రి**

**పాపాలను పోగొట్టే నదీ,సముద్ర స్నానం**

రేపల్లె-ప్రభాతవార్త

ఉత్తరాయణ పుణ్యకాలంలో విశిష్టమైన మాఘమాసం అంటేనే ఆధ్యాత్మికంగా ఆరోగ్యపరంగా భక్తులకు పుణ్యఫలాలను అందిస్తుంది.తెలుగు పంచాంగం ఆధారంగా మాఘశుద్ధ పాడ్యమి నుంచి మాఘ బహుళ అమావాస్య వరకు 30 రోజుల పాటు విశేష కార్యక్రమాలను నిర్వహించుకునే అవకాశం భక్తులకు లభిస్తోంది.సోమవారం ప్రారంభమైన మాఘ మాసం ఫిబ్రవరి 17వ తేదీ వరకు ఉంటుంది.అత్యంత పవిత్రమైన మాసాల్లోని మాఘమాసంలో భక్తులు ఆచరించే పర్వదినాలకు ప్రత్యేక స్థానం ఉంది.మాఘం అంటే పాపాలను సమూలంగా తొలగించేది అని అర్థం.ఈ నెలలోనే విద్యార్థులు ఆరాధించే సరస్వతీ దేవి జన్మదినమైన వసంత పంచమి,సూర్య భగవాన్ ఆరాధనకు అత్యంత శ్రేష్టమైన రథ సప్తమి,విష్ణు సహస్రనామ పారాయణకు విశిష్టమైన భీష్మ ఏకాదశి, పరమేశ్వరుడిని లింగోద్భవ కాలంలో దర్శించుకునే మహా శివరాత్రి వస్తున్నాయి.మాఘ మాసంలో భక్తులకు పుణ్యం ఎలా లభిస్తుందో పురాణాలు సూచించాయి. సూర్యోదయానికి ముందే నదీ స్నానం లేదంటే సముద్ర స్నానం ఎవరైతే చేస్తారో అటువంటి వారి పాపాలన్నీ తొలగిపోతాయని పద్మపురాణం స్పష్టం చేసింది.వైకుంఠ ప్రాప్తి కలగాలంటే మాఘ పురాణంలోని నెల రోజులు రోజుకొక అధ్యాయం చదివినా విన్నా సరిపోతుంది.నువ్వులు, ఉసిరికలు,వస్త్రాలు, పాత్ర,అన్నదానం చేస్తే విశేష ఫలితం లభిస్తుంది.అశ్వర్థ వృక్షాన్ని పూజిస్తుంటారు.బ్రహ్మ ముహూర్తంలో ఆకాశం వైపు చూస్తే నక్షత్రాలు రథం ఆకారంలో కన్పిస్తుంటాయని పురాణాలలో చెప్పబడింది.రథ సప్తమి రోజు పూజలు చేస్తే ఆరోగ్యం,అదృష్టం,రాజయోగాలు లభిస్తాయని పండితులు చెబుతున్నారు.ఆదివారం సూర్యుడి ఆరాధనకు ఎంతటి ప్రత్యేకత ఉందంటే మహిళా భక్తులు శాస్త్రోక్తంగా అనాదిగా ఆరాధనలు చేయడమే .చలికాలం నుంచి వసంత కాలంలోకి ప్రవేశించే తరుణంలో భక్తులు నిర్వ హించే ఆధ్యాత్మిక కార్యక్ర మాలు శరీరాన్ని, మనస్సును ఉల్లాసంగా ఉంచు తాయి.మకర రాశిలో సూర్యుడు సంచరించే ఉత్తరాయణ పుణ్యకాలంలోదైవ చింతనలో భక్తిశ్రద్ధలతో గడిపే భక్తులు విశేష ఫలితాలను పొందుతారని పండితులు పేర్కొంటున్నారు.రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుడు ఏడు అశ్వాలు కలిగిన రథంపై ప్రయాణిస్తూ భక్తులను కరుణిస్తాడనే విశ్వాసం అనాదిగా వస్తోంది.ఏడు జిల్లేడు ఆకులను శరీరంపై ఉంచి స్నానం చేసి సూర్యుడికి ఎదురుగా పొంగలి వండి





చిక్కుడు కాయలతో రథాన్ని తయారు చేసి నివేది స్తుంటారు. జిల్లేడు ఆకులలో ఔషధ గుణాలు ఉంటాయి. సూర్యకాంతిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు కాబట్టి శరీరానికి అవసరమైన 'డి' విటమిన్ సహజసిద్ధంగానే లభిస్తుంది.ఈ పూజా కార్యక్రమం వలన చర్మ సంబంధిత సమస్యలు తలెత్తవని పండితులు చెబుతున్నారు. భక్తి,కర్మ,ధర్మాలను తెలిపే మాఘ పురాణ కథలు వింటే మాఘమాస వైశిష్ట్యంతో పాటు పుణ్యం పొందే మార్గం ఏర్పడుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. విష్ణుమూర్తికి ప్రీతి కరమైన మాఘమాసమైనందున సత్యనారాయణ స్వామి పూజలు కూడా భక్తులు చేస్తుంటారు.మౌని అమావాస్య రోజున చేసే స్నానాలు, పూజలు, ఉపవాసాలకు ప్రత్యేకత ఉంది.మాఘమాసం లో నదీ స్నానం, నారాయణుని పూజ, దానాలు చేస్తే కోటి క్రతువులు చేసినంత ఫలితం లభించడంతో పాటు సమస్త పాపాలు తొలగిపోతాయని బ్రహ్మపురాణం స్పష్టం చేసింది.మృకండు ముని దంపతులు మాఘస్నానం చేసిన కారణంగా పుణ్యఫలితం లభించిందనడానికి వారికి మార్కండేయుడు కుమారుడిగా జన్మించటమే.ఆ తరువాత మార్కండేయుడు అపమృత్యువు నుంచి బయటపడ్డాడు.వేటకై వెళ్ళిన దిలీప్‌రాజు ఒక రుషిని కలిసి మాఘమాసం ప్రారంభమైనందున స్నానమాచరించి ఆ మహాత్మ్యం గురించి తెలుసుకుని సత్ఫలితాలు సాధించాడు. మాఘమాసంలో ఏ నదిలో స్నానం చేసినా ఆ నది గంగా నదితో సమానమే.నదుల నీరంతా తుదకు సముద్రంలోనే కలుస్తుంటుంది.అందుకే సముద్రంలో స్నానం చేస్తే అన్ని నదులలోనూ స్నానం చేసిన పుణ్యఫలితం భక్తులకు లభిస్తుంది.కనీసం మాఘ పౌర్ణమి రోజైనా సముద్ర స్నానం చేస్తే ఆ నెల రోజులూ సముద్ర స్నానం చేసిన ఫలితం లభిస్తుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. లక్ష్మీదేవి, విష్ణువును ఆరాధించడం ద్వారా తమ జీవితాలలోకి ఆర్థిక పరమైన సమృద్ధి, సామరస్యం,జ్ఞానోదయం ఆహ్వానించిన ట్లేనని భక్తులు నమ్ము తారు. మాఘమాసం అంటే శుభకార్యాలు నిర్వహించే నెలగా ప్రజలు భావిస్తున్నారు. వివాహాలు చేస్తే దంపతుల వైవాహిక జీవితం సాఫీగా జరుగుతుందని భావి స్తుంటారు. గృహ ప్రవేశాలు, నామకరణాలు, అక్షరాభ్యాసాలు,పెళ్ళిళ్ళు మాఘమాసంలో నిర్వహించడానికి ప్రజలు ఆసక్తి చూపుతుంటారు.

**శ్యామలాదేవి నవరాత్రులు..**

మాఘమాసంలో 9 రోజుల పాటు దేవీ భక్తులు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.వాస్తవానికి శ్రీ దేవీ నవరాత్రుల పూజలు సంవత్సరంలో 4 సార్లు జరుపుకుంటారు.చైత్ర,ఆశ్వీయుజ మాసాలలో 2 సార్లు,ఆషాడ,మాఘ మాసాలలో 2 సార్లు జరుపుకుంటారు.ఆషాఢంలో అయితే వారాహి నవరాత్రి అంటారు.మాఘ మాసంలో శ్యామల నవరాత్రులని పిలుస్తారు.మాతంగియే రాజ శ్యామల.శ్రీ లలితా పరాభట్టారికా స్వరూపం కొలువైనప్పుడు మహామంత్రిణిగా కుడి పక్కన ఉండే తల్లి శ్యామల దేవి.బుద్ధి,విద్య కోసం ఆరాధిస్తారు.శక్తివంతమైన శ్యామలాదేవి ఆరాధనతో చెడు,ప్రతి కూల శక్తులు తొలగిపోతాయి. శ్యామలా ఉపాసన దశమహావిద్యలో ఒక విద్య.కోల్పోయిన పదవులు తిరిగి పొందాలనుకునే వారు,ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం శ్యామలాదేవీ నవరాత్రులను మాఘ మాసంలో నిర్వహిస్తుంటారు.మాఘ మాసం పూజా కార్యక్రమాలకు సంబంధించి దేవాలయాలు సిద్ధమయ్యాయి.తెలుగు నెలలో 11వ నెల స్థానంలోని మాఘమాసం విశిష్టత అటువంటిది.

# వాసవీమాత కృపకు పాత్రులు కావాలి

**-భక్తిశ్రద్ధలతో వాసవీమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం**
**-భారీ శోభాయాత్రతో పులకించిన స్వర్ణపురి**
**-అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే**

**పొన్నూరు, జనవరి 20,ప్రభాతవార్త:** ఆర్యవైశ్య కుల దేవత శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి కృపకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆత్మారణ దినోత్సవం సందర్భంగా దేవాలయంలో అమ్మవారి కలశ స్నపన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారు శాంతి, అహింసా మార్గాన్ని ఎంచుకొని పరాశక్తి రూపంలో అవతరించిందన్నారు. దీనితో వైశ్యులు వ్యాపారం, సేవపై దృష్టి పెట్టేలా ప్రేరేపించబడ్డట్లు చెప్పారు. వాసవీ అమ్మవారి చరిత్ర పెనుగొండ పురాణాలలో, వాసవీ పురాణాలలో వివరించబడినట్లు తెలిపారు. వాసవీమాత మహిళల గౌరవాన్ని కాపాడాలని నిర్ణయించుకొందన్నారు. ఆత్మార్పణ దినోత్సవంలో తాను కూడా పాల్గొనడం, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ధర్మపరిరక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన అమ్మవారి త్యాగం ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కూటమి ప్రభుత్వంలో వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర



వ్యాప్తంగా పండుగలా నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ నిర్ణయం ద్వారా శ్రీ వాసవీ అమ్మవారి త్యాగానికి తగిన గౌరవం లభించిందని, ఆర్యవైశ్యుల భావోద్వేగాలను కూటమి ప్రభుత్వం గౌరవించిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై పవిత్ర కలశాలను ధరించి నిర్వహించిన శోభాయాత్ర విశేషంగా ఆకట్టుకొంది. ఈ ఊరేగింపు కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం నుండి తోటమ్మ తల్లి దేవాలయం వరకు, అక్కడి నుంచి మళ్ళీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం వరకు సాగింది. భారీ శోభాయంత్రతో స్వర్ణపురి పట్టణం పులకించి పోయింది. ఆధ్యాత్మిక శోభ తాండవించింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో అమ్మవారి శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలను సమర్పించి దేవాలయ మర్యాదలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోటా రవిశంకర్, ఆలపాటి నాగరాజు, కోట హేమసుందరగుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మార్గాలు

**కొల్లిపర, జనవరి 20, ప్రభాతవార్త:** మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.



మంగళవారం కొల్లిపర మండలంలోని శివలూరు, సిరిపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించిన కారణంగా తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.రెక్కల పురుగు ఆకుల మీద 100 నుంచి 200 వరకు గుడ్లను పెడుతుందన్నారు.గుడ్ల నుండి వెలువడిన మొదటి దశ లద్దెపురుగు పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకులు పల్చగా తెల్లగా తయారవుతాయని ఆయన వివరించారు.తర్వాత దశ లద్దె పురుగులు మొవ్వలోనికి ప్రవేశించి ఆకులను తింటాయన్నారు .మొవ్వ విచ్చుకున్నప్పుడు రంధ్రాలు వరుసగా కనిపిస్తాయని ఆయన తెలిపారు.వీటినే షాట్ హోల్స్ అంటారని,రంధ్రాలు పెద్దగా ఉంటే విండో పెన్స్ అని అంటారని చెప్పారు.ఈ పురుగు ప్రత్యుత్పత్తి స్థానంలో కాండంలోకి ప్రవేశించి గింజలను తిని నష్టం కలుగజేస్తుందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఈ పురుగు ఉనికి గమనిస్తూ సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. అధికంగా గుడ్లు కనిపిస్తే గుడ్ల దశపై 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేసుకోవాలన్నారు. తొలి దశ గొంగళి పురుగులను నివారించేందుకు క్లోరిఫైరిఫాస్ 500 మి.లీ లేదా క్వినాల్ ఫాస్ 400 మి.లీ ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. ఒకే ప్రాంతంలో ఉన్న రైతులంతా కలిసి ఒకే సమయంలో మొక్క జొన్నను విత్తుకోవాలని ఆయన సూచించారు.కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు గ్రీన్ లేబుల్ పురుగు మందులైన ఇమామెక్టిన్ బెంజోయేడ్ 5 శాతం ఎస్‌సి 80 గ్రాములు ఎకరాకి లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సి 60 మి.లీ పిచికారీ చేసుకోవాలన్నారు .పెద్ద లార్వాలు కనిపిస్తే విషపు ఎర్రను మొవ్వలో వేయాలని ఆయన సూచించారు.10 కిలోల తవుడు,2 కిలోల బెల్లం,250 గ్రాముల థాయోడికార్బ్ లేదా 500 ఎంఎల్ క్లోరి ఫైరిఫాస్ కలిపి చిన్న ఉండలు చేసి మొవ్వ లోపల పడేలా వేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బంగారు బాబు,రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమమే ఎన్‌జీజీవో లక్ష్యం

**వట్టిచెరుకూరు, జనవరి 20, ప్రభాతవార్త :** ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌జీజీవో అడుగులు వేస్తోందని ప్రత్తిపాడు యూనిట్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కె. శేషగిరి రాజు, జి.పాల్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక



తాసిల్దారు కార్యాలయంలో మంగళవారం ఎన్జి జీవో ప్రత్తిపాడు యూనిట్ తాలూకా ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తహ సిల్దార్ క్షమారాణి చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్జీవో ప్రత్తిపాడు యూనిట్ తాలూకా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ. సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేయబోమని, సానుకూల దృక్పథంతో డిమాండ్ల సాధనకు చిత్తశుద్ధితో కృషిచేస్తా మన్నారు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎన్నో అలుపెరగని పోరాటాలు చేయడం జరిగిందని తెలియ జేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఎన్‌జీజీవో సంఘం చేపట్టిన ప్రతి కార్యక్రమం, డిమాండ్ల సాధన పోరాటాలతో ఎన్నో విజయాలు సాధించిందని పేర్కొన్నారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన సంగం ఎన్జీ జీవోస్ అన్నారు. ఈ సంఘం తరఫున ఎంతోమంది అగ్రనాయకులుగా ఎదిగారని.. ఇందుకు కారణం వారు ఉద్యోగులకు అందించిన సేవల్లో అంకితభావం చూపడమేనన్నారు. గత ప్రభుత్వంలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం దశల వారీగా పరిష్కరించేందుకు ముందుకు రావడం ఆశాజనకమని వివరించారు. కార్యక్రమంలో కోశాధికారి జి.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసరావు, డిస్ట్రిక్ కౌన్సిలర్ జి. బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వందరోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్**

**పొన్నూరు, జనవరి 20,ప్రభాతవార్త:** పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వంద రోజుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ సూచించారు.



నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యా వ్యాసంగం సాగుతుందా..? లేదా...?అనే విషయాలను పరిశీలించారు. ఏ మేరకు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్న విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు కూడా ఈ వంద రోజుల కార్యక్రమం సజావుగా సాగేవిధంగా చూడాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులు, ఉపాధ్యాయులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు.

# జాతీయ ఉపాధిహామీ చట్టం అమలు చేయాలి

నగరం,జనవరి20,ప్రభాతవార్త: జాతీయ ఉపాధి హామి చట్టం పునరుద్ధరణ చేయాలని సీపీఎం నగరం మండల కార్యదర్శి కొప్పుల గోపి అన్నారు.



మంగళవారం స్థానిక మండల కేంద్రంలో,చిలకావారిపాలెంలో పోస్టర్స్ అవిష్కరణచేసి కరప్రతాలను పంపిణీ చేసారు.2025 తెచ్చిన మహాత్మగాంధీ ఉపాధి హామీ చట్టం వల్ల పనిహక్కును హరించి కార్పొరేటర్లకు దోహదపడేలా ఉందని విమర్శించారు.కొత్త చట్టంలో కేంద్రం వాటా తగ్గించి కేంద్రం 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం వాటా వల్ల రాష్ట్రాలపై పెనుభారం మోపుతుందని,జాబ్‌కార్డులు రద్దు,అదార్ కేవైసీ పేరుతో కొట్లాది మంది కూలీలను పనుల నుంచి కుదించే ప్రక్రియ జరుగుతుందన్నారు.2005 చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని,200 రోజులు పని గ్యారింటి చేస్తు,700 రూపాయలు కూలి పెంచాలని తెలిపారు.వ్యవసాయ కార్మికులందరికి ఉపాధి కల్పించాలని ,ఉపాధి హామీ చట్టాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీను, ఏషాపు, బంగారయ్య, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సులభంగా ఫోన్లోనే పోలీసు సేవలు

**ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్**

**కొల్లిపర,జనవరి 20, ప్రభాతవార్త:** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫోన్‌లోనే పోలీస్ సేవలను సులభంగా పొందవచ్చునని కొల్లిపర ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు వేగంగా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించే లక్ష్యంతో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమం కార్యాచరణకు వచ్చిందని తెలిపారు.ఈ సేవల ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండానే ప్రజలు మొబైల్ ఫోన్‌లోనే ఎఫ్ఐఆర్ కాపీ,ఎఫ్ఐఆర్ ప్రస్తుత స్థితి,ఈ-చలానా,పోలీస్ శాఖకు సంబంధించిన సేవలను పొందవచ్చన్నారు.మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ సేవలను పొందాలంటే ముందుగా 9552300009 అనే నంబరును మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.వాట్సాప్ ద్వారా హాయ్ మెసేజ్ పంపాలని సూచించారు.అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలకు సంబంధించిన మెనూ కనిపిస్తుందన్నారు.అందులో సేవను ఎంచుకోండి అనే ఆప్షన్‌ను క్లిక్ చేయడం ద్వారా అవసరమైన సేవలను ఎంపిక చేసుకోవచ్చునని ఆయన వివరించారు.ఆ మెనూలో పోలీస్ శాఖ సేవలు అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు,ఎఫ్ఐఆర్ స్థితి,ఈ-చలానా వివరాలు వంటి సేవలు పొందవచ్చునని ఎస్ఐ ప్రసాద్ వెల్లడించారు.



# క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలి

**వట్టిచెరుకూరు, జనవరి 20, ప్రభాతవార్త :** క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ప్రత్తిపాడు శాసనసభ్యులు, జిల్లా మాజీ కలెక్టర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని గారపాడు రక్షకుని మాత దేవాలయ 13వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సంఘస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే రామాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేవుని యందు భయభక్తులు కలిగి జీవించిన్నపుడే దేవుని కృపకు పాత్రులవుతారని తెలియజేశారు. మన ప్రవర్తన నడవడికతోనే



సమాజంలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు తనను ఆహ్వానించినందుకు సంఘస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంఘంలో అందరూ కలిసిమెలిసి అన్యోన్యంగా జీవించాలని కోరారు. అనంతరం నిర్వహించిన ప్రేమ విందులో పాల్గొని అందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ప్రారంభంలో సంఘస్తులు ఎమ్మెల్యేను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దేవాలయాన్ని సంఘస్తులు రంగురంగు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని**

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 20,ప్రభాతవార్త:** రబీ సీజన్‌లో సాగు చేపట్టిన ప్రతి రైతు పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రియ దర్శిని సూచించారు. చేబ్రోలు మండల పరిధి లోని శేకూరు, వీరానాయకుని పాలెం గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ



సందర్భంగా డిజిటల్ పంట సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు పంట నమోదు చేసే తేదీని, సమయాన్ని ముందుగానే తెలియజేస్తారని, ఆ సమయంలో సంబంధిత రైతులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ సక్రమంగా జరగలేదని భావిస్తే గ్రీవెన్స్ నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ది చేకూరుతుందన్నారు.

# పట్టణంలో కమిషనర్ విస్తృత పర్యటన

**తెనాలి మున్సిపాలిటీ జనవరి20(ప్రభాతవార్త):** పట్టణంలో పారిశుధ్యపనుల పర్యవేక్షణకై మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మంగళవారం ఉదయం పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు.చెంచుపేటలోని మార్కెట్ యార్డు వద్ద డ్రైన్లను పరిశీలించి అనంతరం, బుర్రె పాలెం రోడ్డు లోని డంపింగ్ యార్డును పరిశీలించి అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డంపింగ్ యార్డ్ లోని వ్యర్థాలను త్వరితగతిన తరలించాలని ఆదేశించారు.



తదుపరి బోస్ రోడ్ ప్రధాన వీధిలోని మురుగు కాలువల ను పరిశీలించి,పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా వివిఎస్ఆర్ కాలేజీ వద్ద గల ఫైకస్ పార్క్ నిర్మాణ పనులను పరిశీలించి,పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మొక్కల సంరక్షణను జాగ్రత్తగా చూడాలని అధికారులను ఆదేశించారు.

# పలు గ్రామాల్లో పొలం పిలుస్తుంది

**కాకుమాను జనవరి 20(ప్రభాతవార్త ):** మండల పరిధి రేటూరు,అప్పాపురం గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించిన్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. సుధాకర్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ 2025 సీజన్లో ఈ పంట నమోదు చేయటం జరుగుతుంది కనుక రైతులందరు సమీప రైతు సేవ కేంద్రం లో పాస్ బుక్ కాపీ మరియు ఆధార్ నెంబర్ తీసుకువచ్చి గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి పంట నమోదు చేసుకోవాలిని తెలియజేసినారు. మొక్కజొన్న లో ఎరువుల యాజమాన్యం గురించి తెలియజేయటం జరిగినది.మినుము లో తామర పురుగులు ఆకుల అడుగు నుండి రసాన్ని పీలుస్తాయి. మినుము పైరు 15 నుండి 20 రోజులప్పుడు వేప నూనె 5 మి.లీ లేదా 5 వేప గింజల కాషాయం లేదా నీమస్త్రం పిచికారీ చేసుకోవాలి అన్నారు .ఈ కార్యక్రమం లో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# మల్లాది గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం

**అమరావతి,జనవరి20,ప్రభాతవార్త:** మండలంలోని మల్లాది గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం మంగళవారం నిర్వహించారు.డా పూర్ణ చరణ్ (పశు వైద్యులు) అనిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్స్ గోపాల మిత్రలు గేదెలకు, దూడలకు ,మేకలు మరియు గొర్రెలకు నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, ఎదకు రాని పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందుల అందించారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు భవిరిశెట్టి వెంకటేశ్వరరావు మండల అధ్యక్షులు మంచినేని రాజా పాల్గొన్నారు.



